తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు తేరుగడ్డ వద్ద టిడిపి జెండాను ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి ఆవిష్కరించారు. అనంతరం గెస్ట్ హౌస్ ఆవరణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఇంచార్జి వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్, మాజీ జెడ్పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, నగరడోన డిసి చైర్మన్ కిష్టప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిలేకల్ వెంకటేశ్వర్లు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్పలు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు రామదుర్గం తిమ్మయ్య, మల్లికార్జున పల్లి మల్లికార్జున, హాళహర్వి పాపన్న లను ఈ సందర్భంగా ఇన్చార్జి వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ లు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇన్చార్జి మాట్లాడుతూ, సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్ళు అంట్టు, పేద ప్రజల సంక్షేమం కోసం నందమూరి తారక రామారావు 1983, మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ కి వినిపించిన మహా నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అలాగే టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ మాట్లాడుతూ కొంతమంది ఎన్ని కుట్రలు, కుత్తాంతరాలు చేసిన ఓ రిగేదేమీ లేదన్నారు. పార్టీ పుట్టినప్పటినుంచి తమ కుటుంబం పార్టీ కోసం పనిచేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ కేకును వైకుంఠం జ్యోతి కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆలూరు, దేవనకొండ మండల కన్వీనర్లు శ్రీనివాసులు, విజయ భాస్కర్ గౌడ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ జయరాం, మొలగవల్లి సర్పంచ్ మోహన్ రాజు, రెహమాన్, మెకానిక్ నారాయణ, మాజీ ఎంపిటిసి నరసప్ప, మాదన్న, మసాల జగన్ , హరి రెడ్డి, గుండయ్య, రామమూర్తి, హనుమప్ప, అరికెర ఆంజనేయ, ముద్ద రంగ, బెట్టింగ్ రాజు, గుల్యం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిపై వెంకయ్య కీలక ప్రతిపాదనలు

**మొదటిపేజీ తరువాయి**



అంశాల్లో 2019 తర్వాత రాజకీయ పరిణామాల కారణంగా రాజధాని మార్పు ప్రయత్నాల వల్ల తలెత్తిన న్యాయ మరియు పరిపాలన సమస్యలు ఉన్నాయి. రాజధాని నిర్మాణంలో కేంద్రం ప్రారంభించిందన్న సాయం, తరువాతి మార్పులలో ఏర్పడిన సమస్యలు భవిష్యత్తులో మళ్లీ ఎదురవకుండా చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన హోంమంత్రికి వివరించారు.హోంమంత్రి అమిత్ షా కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి అన్ని క్లియరెన్సులు ఇప్పటికే వచ్చాయని, కేబినెట్ ఆమోదం తర్వాత బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం మాత్రమే మిగిలిందని వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక, అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధం చేయడం రాష్ట్రాభివృద్ధికి, రాజకీయ స్థిరత్వానికి, భవిష్యత్తులో కేంద్రరాష్ట్ర సహకారానికి కీలకమని స్పష్టంచేశారు. రాజధాని శాశ్వతతకు సంబంధించి ఈ చట్టబద్ధతలు అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక రంగం, పర్యాటక, మరియు పరిపాలనా రంగాల్లో కీలక పాత్ర పోషించనుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నారు. అమరావతి నిర్మాణం ప్రారంభం నుండి కేంద్ర సహకారంతో, పునరావృత సమస్యలు లేకుండా కొనసాగించబడితే, రాష్ట్రానికి పెద్ద ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు దొరకుతాయి.వీటితో, ఈ వారంలోనే పార్లమెంట్‌లో చారిత్రక నిర్ణయం తీసుకుని అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధం చేయడానికి అవకాశం కనిపిస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్రంలో అభివృద్ధి, నియమావళి స్థిరత్వం, రాజకీయ సంక్షేమం కోసం కీలకమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాజధాని స్థిరత్వం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతాయి, పారిశ్రామిక, విద్యా, సేవా రంగాల్లో గణనీయమైన మార్పులు సంభవిస్తాయి. అలాగే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వ మార్పులు వచ్చినా రాజధానిని మళ్లీ తరలించే ప్రయత్నాలు చట్టపరంగా సాధ్యంకాకుండా, రాజధాని నిర్మాణం పట్ల భద్రత మరియు ధృఢత్వం ఏర్పడుతుంది.ఈ చట్టం అమలులో, కేంద్రం, రాష్ట్రం, స్థానిక అధికారులు, మరియు రాజకీయ నేతల సమన్వయంతో అమరావతి అభివృద్ధి సక్రమంగా కొనసాగించబడటంతో రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలగబోతున్నాయి. రాష్ట్రంలో రాజధాని నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక, సామాజిక, పరిపాలనా పరంగా కొత్త మలుపులు తీసుకోవడానికి ఈ నిర్ణయం కీలకమని నిపుణులు భావిస్తున్నారు.

# దేశ ప్రజలను విభజించి పాలిస్తున్న బీజేపీ

- **మాజీ మంత్రి మూలింటి మారెప్ప**

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను విభజించి పాలిస్తుందని మాజీ మంత్రి మూలింటి మారెప్ప విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారెప్ప మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను విభజించి పాలిస్తుందని మార్చి 24 సుప్రీంకోర్టు సున్నితమైన అంశాన్ని భారతదేశం ఉలిక్కిపడే విధంగా తీర్పు ఇచ్చిందని స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతుందని రాజ్యాంగ పరిధిలో ఉన్నదే సుప్రీంకోర్టు అని ఎన్నికల కమిషన్ గాని, ఈడి కానీ, దేశంలో ఉన్న అన్ని శాఖలు రాజ్యాంగ పరిధిలోనివే అని సుప్రీంకోర్టు మార్చి 24న క్రైస్తవంలోనికి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని తీర్పునిచ్చిందని . కేంద్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని, కాంగ్రెస్ పార్టీ సర్వ మతాలను సమానంగా చూస్తుందని ఎన్నికలలో ఏవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగాలని బిజెపి బండారం అప్పుడు బయట పడుతుందని ఆమ్ ఆద్మీ ఎంపీ రాఘవ చద్దా అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక ఆయన్ను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేశారని బిజెపి నాయకులు నిజాయితీగా గెలవలేదని మోడీ, అమిత్ షాలకు దమ్ముంటే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని కరోనా సమయం లాక్ డౌన్ లో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని ఇంతవరకు ఎవరికిచ్చారని నల్లధనాన్ని బయటకు తీసుకు వస్తానన్నాడని 11 సంవత్సరాల లో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని మారెప్ప ప్రశ్నించారు 11 సంవత్సరాల్లో మోడీ చేసిన పనులు మూడేమూడు అని వందే భారత్ రైళ్లని, అయోధ్య రామ మందిరం నిర్మాణమని, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం నాలుగు వేల కోట్లతో ఏర్పాటు చేశారని మీరిచ్చిన హామీలు గాలిలో మూట లేనని ఈరోజు కూటమి ప్రభుత్వం గూటమై విష కూటమిలా మారిందని. కొందరు ఆర్థిక ఉగ్రవాదులు క్రైస్తవ ఆస్తులు ఆక్రమించు కుంటున్నారని అలాంటి క్రైస్తవ ఆస్తులకు ప్రభుత్వము రక్షణ కల్పించాలని మారెప్ప కోరారు. అనంతరం కర్నూల్ డిసిసి అధ్యక్షుడు బి క్రాంతి నాయుడు మాట్లాడుతూ రాజ్యాంగపరంగా సామాజిక న్యాయం ప్రతి ఒక్కరికి కలగాలని కాంగ్రెస్ పార్టీ కొన్ని చట్టాలు తీసుకొచ్చింది. మనకి ప్రాథమిక హక్కులు రాజాంగం తరుపున అందరికి పుట్టుకతోనే వచ్చాయని దాంట్లో ప్రధానమైన ఆర్టికల్ 14,15,17,అలాగే 25 అసలు ఒక్క మనిషి గర్వంగా తాను అనుకున్న విధంగా బ్రతకడానికి ఈ ఆర్టికల్స్ ఉపయోగ పడ్తాయ.24వ తేదీన వచ్చిన జడ్జిమెంట్ ను బేస్ చేసుకొని మేము అన్ని విధాలుగా రాజ్యాంగాన్ని పరిరక్షించాలని ఇండిపెండెంట్ జుడిషియరీ ఇండిపెండెంట్ లెజిస్లేచర్ రాజంగం కల్పించింది. అలాంటి సుప్రీం కోర్ట్ దాని వైలెట్ చేస్తూ జర్జ్ మెంట్ అనేది చాలా బాధకరం విచారకరం దానిమీద అల్ రెడీ రిట్లు కూడా ఫైల్ చేసే పరిస్థితి ఏర్పడింది. కేవలం క్రిస్టియన్స్ ఫైత్ ని ఫాలో అయితే మాత్రం ఒక్క వ్యక్తికి సామాజిక న్యాయం దొరికింది ఈరోజు ఆయనకి సమానత్వం దొరికింది ఈ సమాజంలో మనకి ఇప్పటికి కూడా అంటరానితనం లేకుండా ఉందా మరి ఈ సమాజంలో వివక్ష లేకుండా ఉందా ఇప్పటికూడా సామాజిక న్యాయం జరుగుతుందా అని ప్రశ్నిస్తున్నాను. ఈరోజు ఎన్నో కులాలు రిజర్వేషన్ లు కావాలని కోరుతున్నాము ఇక్కడ కూడా కర్నూలు లో కూడా వాల్మీకి బోయలు కావచ్చు, రజకులు కావచ్చు ఎంతో మంది మాకు న్యాయం కావాలని ఈరోజు అడుగుతున్న క్రమంలో ఈరోజు కొత్త క్వశ్చన్లు వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులే జార్జ్మెంట్లు ఇస్తావుంటే ప్రజలకి ఎక్కడ సామాజిక న్యాయం జరుతవుంది భద్రత ఎక్కడ జరుగుతావుంది ఎక్కడ వాళ్లకి కేవలం వాళ్లకి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతావుంటే ప్రభుత్వాలు ఈరోజు ఏమి చేస్తావున్నాయి అనీ ప్రశ్నిస్తున్నాను కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తావుంది రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతా ఉంటే దీని గురించి ప్రస్తావన తీసుకరావడం లేదు రాజ్యాంగ ఉల్లంఘన పార్లమెంట్ చేస్తే దాని క్వషన్ చేయాల్సిన బాధ్యత సుప్రీం కోర్ట్ కు ఉంది, సుప్రీం కోర్ట్ వైలెట్ చేస్తే దాని ప్రస్తావించాల్సిన బాధ్యత పార్లమెంట్ కి ఉంది. ఈరోజు రాజ్యాంగంలో మొదలుపెట్టినది ప్రతి ఒక్కటి చర్చకు వస్తుందని. ప్రాథమిక హక్కులను దెబ్బతీయడానికి కుటిల ప్రయత్నాలు కూటమి ప్రభుత్వాలు చేస్తున్నాయని దీన్ని కాంగ్రెస్ పార్టీ సమూలంగా ఖండిస్తుందని క్రాంతి నాయుడు తెలియజేశారు.

# నేడే కోసిగి పంచాయతీ వేలం పాట

**అఖండ సూర్య మంత్రాలయం :-**

మేజర్ పంచాయతీ అయినటి వంటి కోసిగి గ్రామ పంచాయతీ వేలం పాట 30న సోమవారం రోజున జరుగుతుందని పంచాయతి కార్యదర్శి రంగస్వామి తెలిపారు. అయితే వేలం పాటలో పాల్గొనాలనే వారు సోమవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ నోటిఫికేషన్ లో ఉన్న నిబంధనలకు అనుగుణంగా సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షతన ఆధ్వర్యంలో జరుగుతుంది.వారపు సంత మార్కెట్ సంబందించి వేలం పాటలో పాల్గొన్నే వారు ముందుగా డబ్బులు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గనాలి.పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో కోసిగి ఎస్ఐ రమేష్ రెడ్డి బందోబస్త్ మధ్య ఈ వేలం పాట జరుగుతుంది



# అమరావతి తీర్మానం పెద్ద డ్రామా

**మొదటిపేజీ తరువాయి**

లెక్కలపై అబద్ధాలు ఆడుతున్నారని, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల తరహాలోనే ఇది కూడా ఒక మాయ అని కొట్టిపారేశారు. గతంలో తాము చేసిన తప్పులను, పాపాలను జగన్ మీద వేసి 'గుడ్డ కాల్చి ముఖాన వేసే' ప్రయత్నం కూటమి నేతలు చేస్తున్నారని పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టెండర్లు రద్దు చేసి, మళ్ళీ అవే కంపెనీలకు 30 శాతం అంచనాలు పెంచి ఇవ్వడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ భయంతోనే గతంలో మూటా ముల్లె సర్దుకుని అమరావతికి వచ్చారని విమర్శించారు. 2028 నాటికి హైకోర్టు, అసెంబ్లీ పూర్తి చేసి మోదీని పిలుస్తామన్న చంద్రబాబు మాటలపై నాని సెటైర్లు వేశారు. "మీరు చెప్పిన నవ నగరాలు, ప్రపంచస్థాయి నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయి? రైతుల రిటర్నబుల్ ఫ్లాట్స్ ఎప్పుడు చూపిస్తారు?" అని నిలదీశారు. జగన్‌కు సినిమా ఉందో లేదో 2029లో ప్రజలే చూపిస్తారని, ముందు కూటమి నేతలు తమ సినిమా సంగతి చూసుకోవాలని హితవు పలికారు. మొత్తం మీద అమరావతి అనేది దోచుకోవడానికి తప్ప ఎవరికీ ఉపయోగపడదని పేర్ని నాని తన విమర్శల్లో ఎండగట్టారు

# మంత్రాలయంలో ఘనంగా టీడీపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అఖండ సూర్య మంత్రాలయం :**




44వ వసంతాల్లోకి అడుగుపెట్టిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంత్రాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి గారు, రాకేష్ రెడ్డి పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరణలో భాగమై కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు నాలుగు మండలాల్లో మండల అధ్యక్షులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు తెలుగుదేశం పార్టీ జెండాను ఘనంగా ఎగరవేశారు.అలాగే మంత్రాలయంలో నాలుగు మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించిన అనంతరం పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి లక్ష్యాలపై మాట్లాడారు. రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని 2029లో కూటమి తరపున యువగళం సృష్టికర్త నవ సమాజానికి నారా లోకేష్ గుర్తిపు తెచ్చారు.అనంతరం తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉన్న 11 మందిని మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు ముఖ్య నాయకులు గ్రామ అధ్యక్షులు క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు

# ఇంజనీరింగ్, మెడికల్ సీట్ల పేరుతో సైబర్ మోసాలు

- **కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో**

ఇంజనీరింగ్, మెడికల్ , బీటెక్ సీట్ల పేరుతో అడ్వాన్స్ పేమెంట్లు తీసుకుంటూ జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొందరు సైబర్ నేరగాళ్లు ప్రముఖ కళాశాలలు, విశ్వవిద్యాలయాల పేరుతో ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు, ఫేక్ వెబ్‌సైట్ల ద్వారా సంప్రదిస్తూ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల " పేరుతో అడ్వాన్స్ బుకింగ్ డబ్బులు అడిగి మోసాలు చేస్తారన్నారు.అడ్మిషన్ గ్యారంటీ, తక్కువ ఫీజుతో సీటు కల్పిస్తామని చెప్పి అమాయక విద్యార్థులు, తల్లిదండ్రులను మోసాలు చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు .జిల్లా ప్రజలకు ఎస్పీ సూచనలు.ఏ కళాశాల సీటు కోసం అయినా అధికారిక వెబ్‌సైట్ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారానే దరఖాస్తు చేయాలి.ఫోన్ కాల్స్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఆఫర్లను నమ్మి డబ్బులు పంపవద్దు.వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, ఓటిపిలు ఎవరికీ ఇవ్వకూడదు. అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దు.ఎవరైనా సైబర్ మోసానికి గురి అయితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. జరిగిన సైబర్ నేరం గురించి వెంటనే లేదా ఒక గంటలోపు ఫిర్యాదు చేస్తే మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని కర్నూల్ ఎస్పీ తెలిపారు. విద్యార్థులు , తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి, కేవలం అధికారిక విధానాల ద్వారానే అడ్మిషన్లు పొందాలని కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# పదార్థాలన్నీ కల్తీమయం

కల్తీని అరికడుదాం స్వచ్ఛతను సాధిద్దాం
ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు చేపట్టి నకిలీరాయులు
వారిని భరతం పట్టాలి
కల్తీ బాబులను కనికరించక కటకటాల్లో నెట్టాలి
భారీ జరిమానా విధించి కర్కశంగా శిక్షించాలి
పదార్థాల నాణ్యత లోపించకుండా నడుము బిగించి
అడుగడుగునా నకిలీని అరికడుదాం కల్తీని నిరోధించి
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
రసాయనాల వాడకంతో శరీరం రోగాలతో క్షీణిస్తుంది
కల్తీ పదార్థాల సేవనముతో
యవ్వనం క్షీణిస్తుంది వృద్ధాప్యం దాపురిస్తుంది
కల్తీ మహమ్మారి సునామీల శివమెత్తుతుంది
కల్తీ పదార్థాల ఆస్వాదనతో రకరకాల వ్యాధులతో నరక
యాతన అనుభవిస్తున్నాము
కూరగాయలపైన రంగురంగుల పాలిష్ బియ్యం పాలి
ష్యయం నీలా కల్తీ నీరు కల్తీ
వాతావరణం కాలుష్యముతో కల్తీమయం
నాణ్యతలేని దవాఖాన మందులు
ఎలా బ్రతకడం
ఎలా ఆరోగ్యంగా ఉండడం
నకిలీ కల్తీ విషవలయాన్ని ఛేదించే
ప్రక్రియను ప్రారంభిద్దాం
ప్రతి ఒక్క భారతీయ పౌరుడు నడుము బిగించి అడుగడు
గునా నకిలీని అరికడుదాం
ఆరోగ్యంగా జీవిద్దాం
భవిష్యత్తును కాపాడుకుందాం
రానున్న తరాన్ని కాపాడుకుందాం

**డాక్టర్ సయ్యద్ సమీనా పర్వీన్**
**ప్రభుత్వ ఉపాధ్యాయురాలు**

# మానవ సంబంధాలు కుంటు పడుతున్నాయిరో

మానవ సంబంధాలు దూరమవుతున్నాయి
స్వేచ్ఛ జీవనానికి దగ్గరవుతున్నారు
నైతిక విలువలు తగ్గిపోతున్నాయి
సమస్యల మీద సమస్య వెంటాడు తున్నాయి
అహం,కోపం నిత్యం పెరుగుతున్నాయి
ధన దాహం తో పేట్రేగిపోతున్నారు
చెడు వ్యసనాలకి దగ్గరవుతున్నారు
మనశ్శాంతి నీ కోల్పోతున్నారు
రక్త సంబంధాలను మర్చి పోతున్నారు
మానవత్వాన్ని మంట కలుపుతున్నారు
ఊహ కందని కలలతో
జీవితం నాశనం చేసుకుంటున్నారు
కట్టుబాట్లకు దూరమవుతున్నారు
సంస్కృతిని సంస్కారాన్ని మర్చి పోయారు
కుల మతాల మధ్య సఖ్యత కోల్పోతున్నారు
సోదర భావాన్ని దూరం చేసుకుంటున్నారు
పరాయి మోజులో పడి లైఫ్ నీ పతనం చేసుకుంటున్నారు
మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయి
తద్వార సమాజం కుంటు పడుతుంది
తెలుసుకో మానవా!



**శ్రీనాథ్ నూతలపాటి**
**విజయవాడ**

# తేనెలో మునిగితేలుతుంటే

మబ్బుల్లో తేలుతుంటే
మదులు ముత్యాల్లా మెరుస్తాయి,
ఆకాశ అంచులపై ఆశలన్నీ
అందాల హంసల్లా విహరిస్తాయి...
గాలిలో తేలుతుంటే

గీతాలు గుసగుసలై వినిపిస్తాయి,
అనురాగ అలల ఒడిలో ఆనందాలు
ఆవిష్కృతమై అలరిస్తాయి...
నీళ్లపై తేలుతుంటే

నింగి ప్రతిబింబాలు నవ్వుతాయి,
జ్ఞాపకాల కమలాలు సరస్సులో
జలజలా వికసించి పలుకుతాయి...
కెరటాలపై తేలుతుంటే

కాలకదలికలతో కలలు కొట్టుకుపోతాయి,
అలల ఆటలలో ఆవేదనలే
అద్భుత గీతాలుగా మారుతాయి...

ఊహల్లో తేలుతుంటే
'అసాధ్యం' అనే మాటలు కనబడకుంటాయి,
అక్షరాల రెక్కలపై అంతరంగాలు
అనంత గగనంలో విహరిస్తాయి...

కవితల్లో తేలుతుంటే
ప్రతి భావం పరిమళ పుష్పమవుతుంది,
ప్రతి పదం పలికే స్వరమవుతుంటే,
ప్రతి క్షణం ప్రణయగీతంగా మారుతుంది...

తేనెలో మునిగితేలుతుంటే
బాధల బరువంతా గాలిలో కలిసిపోతుంది,
మనసు మేఘమై మాటలు జలధారలై
కవిత్వం ప్రవాహమై పారుతుంది...



**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**




# నైతిక విలువలను కాపాడుకుందాం!

నైతిక విలువలు మసకబారుతున్నాయి
అవినీతి పరులు రాజ్యమేలుతున్నారు
మానవ సంబంధాలను మరచిపోయి,
సనాతన ధర్మానికి తూట్లు పోడుస్తున్నారు..
మనిషి తన అవసరాలకు మించి చుట్టూ వున్న
అడవులు,మృగాలు,ఆనంతాకాశం విహరించే పక్షులను
చీల్చిచెండాడుతున్నాడు
కొండలు గుట్టలు తొలిచి ఆకాశహర్మ్యాలను
నిర్మించుకుంటున్నాడు..
సనాతన ధర్మాలన్నీ ఆవురైపోతున్నాయి
దేశ ప్రగతికి చెదలు పడుతున్నాయి
పవిత్ర ప్రదేశాలలో అపపవిత్రతను చూసి,
భూదేవి కన్నీరు మున్నీరై విలపిస్తుంది..
జీవన వికాశానికి ప్రేరణ కలిగించే
ఆ దివ్య సూక్తులను మంట గొలిపి,
మానవత్వపు విలువలను కాలరాసి,
సత్యమేవ జయతే అనే సిద్ధాంతాన్ని
మరచిపోతున్నారు..
మన జాతి గౌరవానికి ప్రతీకయైన
సనాతన ధర్మ మార్గంలో పయనించి,
సత్యం న్యాయం ధర్మం దిశిగా అడుగులేద్దాం
మానవ సంబంధాలను అభివృద్ధి పరుచుకుందాము!



**ముత్యం వెంకటేశ్వరరావు**
**గురజాల,పల్నాడు జిల్లా**



# నా మనసు వారి మాట వినననంది అజ్ఞానంతో



అమ్మ నాన్నల చెప్పే మాటలు అసలే విననంది మూర్ఖపు
జ్ఞానంతో..
ఎన్ని మారులు నా ఉన్నతిని కోరి, చక్కగా చదువుకో నాన్న
అంటే, నేను స్వేచ్ఛగా, నా ఇష్ట
రీతిలో జీవిస్తానంటే
కాదు, కూడదు అని ఒక్కటే గోల చేశారే
అందుకే నా మనసు
వారి మాట విననంది అజ్ఞానంతో...
అలా, వినని కారణంగా నేను, పెద్ద చదువులు
చదువుకోలేక, సరైన ఉద్యోగం లేక, నేడు
నా కన్న ఉన్నతుడిని చూసి కుళ్ళుకుంటుంది
నా మనసు బాధ పడుతూ, నా మూర్ఖపు మనసు , అమ్మ
నాన్న చెప్పేది సరి కాదని, అందుకే నా మనసు వారి మాట
విననంది అజ్ఞానంతో.. తప్పు ఎవ్వరిది, అమ్మ
నాన్నలు చెప్పింది వినక కోరింది పాటించక, నా కళ్ళ
ముందే నా మిత్రు ల, ఉన్నత స్థితిని చూసి
ఓర్వలేని తనంతో నా అంతరాత్మ రగిలి పోతుంటే.
అందుకే నా మనసు వారి మాట విననంది అజ్ఞానంతో..
అయ్యో, నేనెంతో సంతోషంగా ఉండ వలసిన వాన్ని, అమ్మ
నాన్నల మాటలు చెవ్విన పెట్టక పోయే
సరికి, నా పరాభవం నకు చింతించాల్సిన
గతి పట్టిందే నేడు, నీవు చేసుకున్నదే కదా యని నా అంత
రాత్మ పదే పదే గోసించింది..
ఇకనన్న, మనిషిలా మానవత్వమున్న
మంచి మనిషిలా, అమ్మ నాన్నలను క్షమించమని వేడు
కొమ్మని కోరుతూ,
అదే వేళ్లలో నా గుండెలో చెలరేగే అలజడితో,నన్ను
మారమని సూచిస్తూ, నా, అంతరాత్మ నొక్కి పలికింది.. నా
మేలు కోరి... నా క్షేమం కోరి...
ముందున్న భావి
జీవితాన్ని చక్కదిద్దు కొమ్మని !

**గుండు కోటేశ్వర్ రావు**
**కాశీబుగ్గ వరంగల్**

# లోడే రాములుకి ఉత్తమ కవి పురస్కారం అందించారు



**కూకట్ పల్లి, అఖండ సూర్య**

ఆదివారం రోజున సుందరయ్య భవన్,ప్రగతి నగర్, కూకట్ పల్లిలో తపస్వి మనోహరం సంస్థ వారి 5 వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా పుస్తకాల ఆవిష్కరణలు మరియు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్న కవులకు రచయితలకు, కార్టునిస్ట్ లకు పురస్కారాలను తపస్వి మనోహరం CEO, కవి, రచయిత శ్రీ నిమ్మగడ్డ కార్తీక్ గారు అందజేసి గౌరవించారు.. ఇట్టి వేడుకలో స్వాములవారి లింగోటం, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీ లోడె రాములుని ఉత్తమకవి పురస్కారంతో సన్మానం చేశారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధులుగా సీనియర్ జర్నలిస్ట్,రచయిత, చతుర, విపుల పత్రికల పూర్వ సంపాదకులు శ్రీ చంద్ర ప్రతాప్ కంతేటి గారు,సినీగేయ రచయిత, కవి,నటులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత శ్రీ సాదనాల వెంకట స్వామి నాయుడు కథ, నవల,రేడియో, బుల్లితెర, సినిమా రచయిత శ్రీ పి. చంద్రశేఖర్ ఆజాద్ గారు పాల్గొని కవులకు, రచయితలకు కవిత్వంలోని మెలకువల గురించి తెలియజేస్తూ, తపస్వి మనోహరం సంస్థ నిస్వార్థంగా కవులను ప్రోత్సాహిస్తూ అతి తక్కువ కాలంలో పుస్తకాలను ప్రచురించి ఆవిష్కరణలు చేస్తున్న శ్రీ కార్తీక్ గారి సాహితీ సేవను కొనియాడారు. ఈ తపస్వి మనోహరం సంస్థకు వెన్నుదన్నుగా నిలిచి అపార సేవలు అందిస్తున్న మహిళామణులను అభినందించారు. జీవన సాఫల్యం ఉత్తమ పురస్కారాలు అందుకొన్న కవులు రచయిత్రులు తపస్వి మనోహరం సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ పాత్ర అద్వితీయమైనది



**అఖండ సూర్య సంగారెడ్డి**

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు 2, 3, 4 ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కలవకూర్, మల్కాపూర్, అంగడిపేటలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా "జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ పాత్ర" అనే అంశంపై ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన సంఘాల నాయకుడు డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ, కుల, మత, భాష, ప్రాంత భేదాలు లేకుండా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిరంతరం సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. దేశ నిర్మాణం మరియు జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర అత్యంత ముఖ్యమైందని పేర్కొన్నారు. వాలంటీర్లు స్వచ్ఛందంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ, ఏడు రోజులపాటు గ్రామీణ ప్రజల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పించడం, సాంఘిక మరియు ఆర్థిక దురాచారాల నిర్మూలనకు కృషి చేయడం, పర్యావరణ పరిరక్షణ, అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై చైతన్యం తీసుకువచ్చి ప్రజలను దేశాభివృద్ధిలో భాగస్వాములుగా మారుస్తున్నారని వివరించారు. బాలికల శీతాకాల శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని అన్నారు. అలాగే మహిళలకు సమాజంలో ఉన్న గౌరవాన్ని కాపాడుతూ భవిష్యత్తు తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల అభివృద్ధి ద్వారానే ఉన్నతమైన జీవితం



**అఖండ సూర్య సంగారెడ్డి**

కేంద్ర మానవ వనరులు యువజన వ్యవహారాల శాఖ సహకారంతో తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు 2, 3, 4 ఆధ్వర్యంలో కలవకూర్, మల్కాపూర్, అంగడిపేట గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా "నాయకత్వ లక్షణాలు - నైపుణ్యాల అభివృద్ధి" అంశంపై ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోలాపూర్‌కు చెందిన జ్ఞాన ప్రబోధిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ అమూల్ గాంగిలి మాట్లాడుతూ, యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. నైపుణ్యాల ద్వారానే సరైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నాయకత్వ లక్షణాలు నైపుణ్యాల అభివృద్ధితో యువత ఏ లక్ష్యాన్నైనా సాధించగలదని పేర్కొన్నారు. యువత స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని, దేశ నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో నిర్మాణాత్మక కార్యక్రమాలను ప్రాయోగికంగా నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా బాలికలను ఉద్దేశించి అమూల్ గాంగిలి మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళలు లక్ష్యాన్ని నిర్ణయించుకొని కృషి చేస్తే ఏ స్థాయికైనా ఎదగగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి ఇతరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఉంటాం

- **స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్తాం**
- **కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**

ఆరేళ్లుగా సేవలందిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లను శానిటేషన్ విభాగంలో తగిన గుర్తింపులబించేలా చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌ను ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మర్యాదపూర్వకంగా కలిసిన స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తమ ఉద్యోగ భద్రత శానిటేషన్ డ్రైవర్లుగా గుర్తించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఎటువంటి ఉత్తర్వులు లేకపోయినప్పటికీ చాలిచాలని వేతనాలతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో డ్రైవర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్మికుల ఉద్యోగ భద్రత వేతనాల పరిష్కారానికి పాలకవర్గం తరపున పూర్తి సహకారం అందిస్తామని పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం వచ్చేలా ఒత్తిడి తెస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా మేయర్ పునరుద్ఘాటించారు. వినతిపత్రం అందించిన వారిలో స్వచ్ఛ ఆటో డ్రైవర్లు బి.అనిల్ కుమార్, నాగేందర్ బాబు, బాలాజీ, సయ్యద్ అలీ తదితరులు ఉన్నారు.



అఖండ సూర్య
GENERAL
సోమవారం
30–03–2026
విజయవాడ

# దేశ రక్షణలో భాగస్వాములు కండి



- ఇండియన్ ఆర్మీలో చేరండి
- భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం 2027 రిక్రూట్మెంట్..
- అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**అఖండ సూర్య సంగారెడ్డి:**
భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం రిక్రూట్మెంట్ 2027 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైందని, ఆసక్తి కలిగిన యువత ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ జాయిన్ ఇండియన్ ఆర్మీ పోర్టల్ (www.joinindianarmy.nic.in) ద్వారా ఫిబ్రవరి 2026 నుండి 01 ఏప్రిల్ 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా చదవాలని, అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే, ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలు, వైద్య పరీక్షలు వంటి దశలు ఉంటాయని తెలిపారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, దేశసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. యువత శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిత్య వ్యాయామం, పరుగు, ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల తేదీలు మరియు ఇతర పూర్తి వివరాల కోసం పై అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించగలరని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు.

**విద్యార్హతలు:**

అభ్యర్థులు 10వ తరగతి / మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
5 ప్రధాన విషయాలలో మొత్తం 45% మార్కులు ఉండాలి.
ప్రతి విషయానికి కనీసం 33% మార్కులు తప్పనిసరి.

# వ్యవసాయ కూలీకి 6000 రూ పెన్షన్లు ఇవ్వాలి



- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభలు
- జిల్లా కార్యదర్శి పి నరసింహ

**కల్వకుర్తి, అఖండ సూర్య :**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలను ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి పి నరసింహ తెలిపారు. చారగొండ మండల పరిధిలోని జూపల్లిలో రైతులు రైతు కూలీలకు వివరిస్తూ జిల్లాలోని వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి వి బి జి రాంజీ బిల్లును తక్షణమే రద్దు చేయాలని మహాసభలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరు వెంకట్ రాములు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ పద్మ ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. వ్యవసాయ కూలీలకు వ్యవసాయంలో యాంత్రికరణ జరిగిన నేపథ్యంలో స్థానికంగా వ్యవసాయ పనులు దొరకడం లేదని ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి ₹200 రోజులు పనులు కల్పించి రోజుకు 800 రూపాయలు కూలీలతో కనీస కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పథకాన్ని బిజెపి కేంద్ర ప్రభుత్వం గత డిసెంబర్ 18న రద్దుచేసి కూలీలకు స్థానికంగా ఉపాధి పనులు దొరకకుండా కుట్ర చేసిందని ఆరోపించారు. 58 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కూలీకి కనీసం 6000 పెన్షన్లు ఇవ్వాలనన డిమాండ్ చేశారు. కూలీల సమస్యలను చర్చించి సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని భవిష్యత్తులో కూలీల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని అన్నారు.

# ఫిట్ ఇండియా చొరవ కింద ఐఐటి హైదరాబాద్ 'సండేస్ ఆన్ సైకిల్

- ముఖ్యఅతిథిగా బ్యాట్మెంటన్ పి గోపీచంద్

**అఖండ సూర్య సంగారెడ్డి**

ఐఐటి హైదరాబాద్‌లో 1000 మందికి పైగా సైక్లిస్టులతో ఫిట్ ఇండియా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం ఊపందుకుంది. ఫిట్ ఇండియా డైరెక్టర్ మరియు ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ అయిన పుల్లెల గోపీచంద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యకరమైన భారతదేశం కోసం జాతీయ పిలుపును ప్రతిధ్వనిస్తూ, భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని ఫిట్ ఇండియా సహకారంతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (IITH), ఫిట్‌నెస్, సైక్లింగ్ మరియు చురుకైన జీవన విధానాన్ని ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇన్‌స్టిట్యూట్ మరియు విస్తృత సమాజం నుండి 1000 మందికి పైగా పాల్గొనేవారిని ఒకచోట చేర్చే 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐఐటిహెచ్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ కార్యక్రమం, 10 కి.మీ మరియు 20 కి.మీ సైక్లింగ్ మార్గాలతో పాటు వార్మప్ సెషన్‌లు, జుంబా మరియు సామాజిక కార్యక్రమాలతో క్యాంపస్‌ను ఒక చైతన్యవంతమైన ఫిట్‌నెస్ వేదికగా మార్చింది. సైక్లింగ్ వంటి సరళమైన, స్థిరమైన పద్ధతుల ద్వారా ప్రతిరోజూ ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించాలనే ఫిట్ ఇండియా దార్శనికతకు ఈ కార్యక్రమం అనుగుణంగా ఉంది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా, ఫిట్ ఇండియా & ఖేలో ఇండియా డైరెక్టర్ సుశాంత్ కంద్వాల్, ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఎస్. మూర్తిలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చందనా జయరామ్, రవి నేత, సంతాన సెల్వన్ ప్రత్యేక అతిథులుగా మరియు ఫిట్ ఇండియా అంబాసిడర్లుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ, పుల్లెల గోపీచంద్ క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. శారీరక శ్రమ దీర్ఘకాలిక బలాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. క్రీడలను ఒక నిత్య అలవాటుగా అలవర్చుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే, హాఫ్‌మారథాన్, సైక్లింగ్ డ్రైవ్‌ల వంటి కార్యక్రమాల ద్వారా నిరంతరం ఫిట్‌నెస్ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నందుకు ఐఐటిహెచ్‌ను ఆయన అభినందించారు. ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఎస్. మూర్తి, విద్యా జీవితంలో క్రీడలను పొందుపరచడానికి తమ సంస్థ యొక్క నిబద్ధతను నొక్కిచెబుతూ, ఇలా అన్నారు: "ఐఐటిహెచ్‌లో, ఫిట్‌నెస్ మరియు శ్రేయస్సు విద్యలో అంతర్భాగమని మేము విశ్వసిస్తాము. సైక్లింగ్‌ను ఒక జీవనశైలిగా అలవర్చుకోవడానికి మేము విద్యార్థులను చురుకుగా ప్రోత్సహిస్తాము. అంతేకాకుండా, క్యాంపస్‌లో చురుకుగా సైక్లింగ్ చేసేందుకు వారికి సహాయపడటానికి, అడ్మిషన్ సమయంలోనే సైకిల్ కొనుగోలు చేయడానికి మద్దతును కూడా అందిస్తాము. క్రీడలలో నిరంతర భాగస్వామ్యాన్ని అకడమిక్ క్రెడిట్‌లతో అనుసంధానించడం ద్వారా, క్రీడలను మరియు శారీరక కార్యకలాపాలను మా అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఏకీకృతం చేయడానికి కూడా మేము కృషి చేస్తున్నాము. దీనిని మా ఫ్రాక్టల్ అకడమిక్ సిస్టమ్‌లో ఒక అంతర్భాగంగా మారుస్తున్నాము. 'సండేస్ ఆన్ సైకిల్' వంటి కార్యక్రమాలు, 'ఫిట్ ఇండియా' అనే ఉన్నత దార్శనికతకు దోహదపడుతూ, సర్వతోముఖాభివృద్ధి గల వ్యక్తులను తీర్చిదిద్దడంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయి." ఫిట్ ఇండియా డైరెక్టర్ శ్రీ సుశాంత్ కంద్వాల్ మాట్లాడుతూ, ఈ అద్భుతమైన భాగస్వామ్యం ఫిట్ ఇండియా యొక్క 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని ప్రతిబింబిస్తుందని, అలాగే విద్యార్థులు, అధ్యాపకులు మరియు సమాజం ఫిట్‌నెస్ ఆధారిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే ఐఐటి హైదరాబాద్ ఒక ఆదర్శ ప్రాంగణంగా నిలుస్తుందని పేర్కొన్నారు.










## తక్కువ సమయం, తక్కువ వ్యయంతో

# న్యాయమందించే లోక్ అదాలత్

**అఖండ సూర్య సంగారెడ్డి**
తీయ మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, గౌరవ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... లోక్ అదాలత్ వేదికగా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని తెలిపారు.దీంతో కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు ప్రజలకు త్వరిత, తక్కువ వ్యయంతో న్యాయం అందించే సమర్థవంతమైన వేదికలని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా సేవలందిస్తున్న ఆమె, ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై భారం తగ్గడమే కాకుండా సామరస్య వాతావరణం నెలకొంటుందని అన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.







# జాతీయ మెగా లోక్-అదాలత్

- 4868 కేసుల్లో విజయవంతంగా రాజీ
- సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ: 1.42 కోట్లు తిరిగి బాధితులకు అందేలా కోర్ట్ ఆదేశాలు
- అద్భుత సమన్వయం, అంకితభావంతో లోక్-అదాలత్‌ను సక్సెస్ చేసిన జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందిపై ఎస్పీ ప్రశంసలు

**అఖండ సూర్య సంగారెడ్డి**

జాతీయ మెగా లోక్‌అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి 717 - ఐపిసి కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందని,2722 ఇపెట్టి, 1429 డిడి కేసులలో అడ్మిషన్/ జరిమాజన విధించడం జరిగింది. సైబర్ నేరాలకు సంభందించి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 73 సైబర్ క్రైమ్ కేసులలో రూ: 1.32 కోట్లు, ఎఫ్ఐఆర్ లేకుండా 88 కేసులలో 10.83 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ నుండి అనుమతి పొందడం జరిగిందని అన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్‌అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు సమఉజ్జులు ఉంటారని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ప్రత్యేక ఘటన : 2021లో సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి, ఐదేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ముగింపు పలికారు. మురళి-శ్రీలేఖ దంపతులను మళ్లీ ఏకం చేసి కుటుంబాన్ని కలిపారు. ఈ సందర్భంగా వారు సంగారెడ్డి జిల్లా పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసుల అత్యుత్తమ పనితీరును కొనియాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో చూపిన కట్టుబాటు, సమన్వయం, సేవా భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని ఎస్పీ గారు గర్వంగా తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు పి.పి లు, వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, D4C డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ ఎస్ఐ, కోర్ట్ డ్యూటీ అధికాలు, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ గారు అభినందించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక












- .హ్యాపీ సండే ఉల్లాసంగా. ఉత్సాహంగా

**అఖండ సూర్య సంగారెడ్డి**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99days ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా సంగారెడ్డి పట్టణం నందు హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వారం లో 6రోజులు తీరిక లేని కార్యక్రమం లతో గడిపే పట్టణ ప్రజలకు ఆదివారం రోజు ఆరోగ్యం తో పాటు ఉల్లాస భరిత కార్యక్రమం లు నిర్వహించాలనే ఉద్దేశ్యం తో పురపాలక సంఘం ఆధ్వర్యంలో లో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో యోగ తో పాటు డాన్స్ తో నిర్వహించే వ్యాయామలు, కరాటే, వంటి కార్యక్రమం లు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధి మునిసిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి కూన వనిత సంతోష్ గారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇలాంటి కార్యక్రమం లు అటవిడుపు లాగా ఉంటాయని, ఆరోగ్యం పట్ల అందరు శ్రద్ధ వహించాలని సూచించారు. తొందర్లోనే పార్క్ ప్రాంతంలో లో టాయిలెట్ ల నిర్మాణం చేపడుతామని తెలియజేసారు. మునిసిపల్ కమీషనర్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం విభిన్న కార్యక్రమం ల తో ప్రజల ముందుకు వస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ గారు, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి గారు, NULM డైరెక్టర్ లావణ్య గారు, వార్డ్ కౌన్సిలర్ సతీష్‌రెడ్డి గారు, మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు ,యువజన సంఘాల నాయకులు కూన వేణు గారు, యోగ గురువులు దత్, సోమలింగం గారు,అన్ని శాఖల ఉద్యోగులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు

# కంది మండలం పరిధిలోని జుల్కల్ గ్రామంలో విషాదం







- భర్త మరణంతో మానసికంగా కృంగిపోయి మమత ఇద్దరు పిల్లలను చంపి, ఆమె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన.

**అఖండ సూర్య, కదిరి :**

ఘటన స్థలానికి చేరుకొని, క్లూ టీమ్స్ సహాయామతో పరిస్థితిని సమీక్షించన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.
అఖండ సూర్య సంగారెడ్డి కంది మండలం పరిధిలోని జుల్కల్ గ్రామంలో ఒక మహిళ మరియు ఆమె ఇద్దరు చిన్నారులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూ టీమ్స్ సహాయంతో ఘటనపై సమగ్రంగా పరిశీలించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. మృతురాలు మమత. భర్త పట్నం ప్రవీణ్ జనవరి నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, మానసికంగా కృంగిపోయిన మమత ఈ రోజు మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపి, అనంతరం ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. అసలు మరణ కారణాలపై స్పష్టత కోసం దర్యాప్తు కొనసాగుతుందని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజలు సమస్యలను ఒంటరిగా భరించకుండా, కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులతో పంచుకోవాలని సూచించారు.

# సేవకు సన్మానం

**మహానంది, అఖండ సూర్యన్యూస్.**
శ్రీశైల నియోజక వర్గం తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్న ఐ టి డిపి సబ్యులకు తెలుగుదేశం పార్టీ శ్రీశైల నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సన్మానించారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ సత్కారం చేసినట్లు తెలిపారు. మహానంది మండలం శ్రీనగరం గ్రామానికి చెందిన ఏటుకురి సతీష్ కుమార్ ను ఎమ్మెల్యే సన్మానించి పార్టీ కోసం ఎప్పటికప్పుడు పాటుపడాలని కోరారు.





## ఊరువాడ మెచ్చేలా తెలుగుజాతి గర్వించేలా

**మహానంది, అఖండ సూర్య న్యూస్.**

ఊరువాడ మెచ్చేలా తెలుగుజాతి గర్వించేలా గ్రామ మెరామాన పసుపు జెండా రెపరేప లాడింది. ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 44 సంవత్సరాలు కావడంటి శ్రీశైల నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కంచర్ల శివశంకర్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జి నరాల మౌళీశ్వర రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షులు శామల జనార్దన్ రెడ్డిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు కేవలం పేదలకోసమే ఏర్పడిన తెలుగుదేశం పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు జాతీయ పార్టీగా కొనసాగుతుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి ప్రజల వద్దకే పరిపాలన, ఒక్కరూపాయకు కిలో బియ్యం,మండల వ్యవస్థ తదితర సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కేశవరావు, సాయి బాబా, జయరాముడు,శ్రీనివాసులు, శేఖర్, పెద్దన్న, హోటల్ రాజు, హుస్సేన్ వలి,కిలారు వెంకటేశ్వర్లు,రవిస్వామి, మహేశ్వర రెడ్డి, మహానంది దేవస్థానం పాలకమండలి మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, పాశం రాజా,సుదర్శన్ రెడ్డి,బీసీ సంక్షేమ సంగం నాయకులు లక్ష్మీనారాయణ,నందిపల్లి మహేశ్వర రెడ్డి,మాజీ సర్పంచ్ రాముడు, తెలుగుగంగ డిస్టిబ్యూటరీ కమిటీ మెంబర్ క్రాంతి కుమార్ యాదవ్, రంగస్వామి, నీటిసంగం ప్రసిడెంట్ కసెట్టి శ్రీనివాసులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అఖండ సూర్య, గూడూరు :**

తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 సంవత్సరాలు పూర్తి కావడంతో గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు కె. రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టిడిపి జెండాను ఎగురవేశారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. పేదలు, రైతులు, మహిళలు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బోజుగు దానమయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రేమాట వెంకటేష్,మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, మల్లాపు బుడ్డంగలి, కుమ్మరి ఎల్లయ్య, వాల్మీకి గుడి ప్రెసిడెంట్ బాబు, ప్రభాకర్ నాయుడు, విద్యా కమిటీ చైర్మన్ కర్ణ,నీటి సంఘం అధ్యక్షులు నాయుడు,భాస్కర్ గౌడ్,నాగప్ప యాదవ్,మన్నన్ బాషా, నడిపన్న,గౌండ కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షులు సులేమాన్,ఇబ్రహీం, అద్దు, కూరగాయలు చాంద్, గిడ్డయ్య,అబ్రహం,తేజ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 44వ టిడిపి పార్టీ ఆవిర్భావ వేడుకలు



**అఖండ సూర్య, గూడూరు :**

గూడూరు నగర పంచాయతీలోని పాత బస్టాండ్ ఆవరనంలో 44వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, మాజి సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి, టీ. సి. మెంబర్ చెట్టు కింద సురేష్, మాజి వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు సంగాల మధు ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి బాణ సంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా చరణ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలోనే క్రమశిక్షణకు నీతి నిజాయితీకి పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు తెలుగు జాతి గుండె చప్పుడును ఢిల్లీకి తెలిసేలాగా చాటి చెప్పిన గొప్ప పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ఇలాంటి పార్టీకి కార్యకర్తలుగా పని చేస్తున్నందుకు మాకు గర్వంగా ఉందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల కొరకు ఎన్నో విప్లవాత్మక సంక్షేమ పథకాల అందించిన గొప్ప పార్టీ టిడిపిదేన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగ యువతకు అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించారన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉండదని, ఏపీని దేశంలోనే ఉన్నత రాష్ట్రంగా విద్య ఎందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి రైతు సంఘం కార్యదర్శి రేవుల గోవిందు, వి.బీ కిషోర్, వాల్మీకి సంఘం కార్యదర్శి కొండమీద కేశవులు, వర్మ,మూలగేరి లక్ష్మన్న, అయ్యవారి నాయుడు,వడ్డె నాగేష్, వై. నాగరాజు, బేతపల్లి మధు,నరసింహ, సురేంద్ర, మనపాడు శ్రీనివాసులు, దస్తగిరి, అశోక్, మంగలి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ టౌన్ సి. ఐ. యుగంధర్ హెచ్చరిక



**ఆళ్లగడ్డ, అఖండ సూర్య,**

ఐ పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ నేపథ్యంలో ఆళ్లగడ్డ పట్టణ యువత క్రికెట్ బెట్టింగ్ వ్యసనాలకు దూరంగాఉండాలని ఆళ్లగడ్డ అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,. క్రికెట్ అనేదిఒక వినోదం మాత్రమేనన్నారు. దానిని జూదముగా మార్చుకుని జీవితాలనునాశనము చేసుకోవద్దని ఆయన కోరారు. ఎవరైనా ప్రత్యక్షంగా గానీ, యాప్ ల ద్వారా కానీ బెట్టింగ్ లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ వేడుకలు

- **పార్టీ జెండా ఆవిష్కరణతో ఉత్సాహంగా కార్యకర్తలు**
- **.భవిష్యత్తు విజయాలకు సంకల్పం చేసిన టిడిపి శ్రేణులు**

**ఆదోని అఖండ సూర్య ప్రతినిధి:**

ఆదోని పట్టణంలోని ఇంద్రనగర్ వార్డులో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, వార్డు ఇంచార్జ్ ఐసి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉదయం నుంచే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, టిడిపి స్థాపక నాయకుల సేవలను స్మరించుకున్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, టిడిపి ప్రజల ఆశయాలను నెరవేర్చే పార్టీగా నిలిచిందని, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.ఇకపై కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని కార్యకర్తలు సంకల్పం చేశారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంతో పాటు, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ బలాన్ని పెంచే దిశగా కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వేడుకలు ఇంద్రనగర్ ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమంలో వలి, ఉప్పర శాంతమూర్తి, వడ్డే హనుమంతు, లక్ష్మమ్మ నగర్ రంగ నాయుడు, జిలేబి శంకర్, కొమ్ము రమేష్, కొమ్ము పెద్ద హనుమంతు, మౌలాలి, ఎరుకుల మస్తాన్,గౌస్, వాల్మీకి మేస్త్రి కృష్ణ, బాలు యాదవ్, రాజేష్, అంగడి కృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు



## ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం

**అఖండ సూర్య. పుల్లలచెరువు**

తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.అని గ్రామ పార్టీ అధ్యక్షులు మేడికొండ అనిల్ కుమార్. తెలిపారు ఇందులో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు పొట్ల గోవిందు మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ తరతరాల తెలుగు వారి ఆకాంక్షలకు ప్రతిరూపం. అని కొడియాడారు. రాష్ట్ర పార్టీతెలుగు రైతు కార్యదర్శి. కాకర్ల కోటయ్య మాట్లాడు తు పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ. ఆవిర్భావ దినోత్సవం అంటే మన ఇంటి పండుగ. ఈ పండుగ సందర్భంగా ప్రతి కార్యకర్తకూ పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నాను' అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు.. ఆ పార్టీ అధినేత, పయ్యావుల ప్రసాద్ టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కేవలం ఒక రాజకీయ వేదిక మాత్రమే కాదు.. ఇది కోట్లాది మంది తెలుగు వారి ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం. 'సమాజమే దేవాలయంప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లోకి వెళ్లిన తీరు.. గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గజ్జల్లి భాస్కరరావు. మేడికొండ లక్ష్మీనారాయణ. ఎంపీటీసీ మేడికొండ రాధాకృష్ణ. పల్లపాటి బాదరయ్య. మాజీ ఎంపిటిసి ఈదమ్మ నాయుడు ఎస్సీసెల్ అధ్యక్షులు కేసనపల్లి బక్కయ్య గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు బడిపాటి ఆంజనేయులు. నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## జీనేపల్లి గ్రామంలో అర్ధ రాత్రి సర్వే పై కలకలం

**ఆళ్లగడ్డ, అఖండ సూర్య :**

ఆళ్లగడ్డ తాలూకాలోని శిరివెళ్ళమండలము జీనేపల్లి గ్రామ పొలాల్లో అర్ధ రాత్రి గ్యాస్, ఆయిల్ వారు సర్వే నిర్వహించడంపై గ్రామంలో కల కలం లేపుతున్నది. రైతులకు ఎటు వంటి సమాచారం లేకుండా ఈ అర్ధరాత్రి సర్వేలు ఏమిటో అర్థంకాక జీనేపల్లి గ్రామ రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవలఆళ్లగడ్డ తాలూకాలోని రుద్రవరం మండలము చిలుకలూరు గ్రామ పొలాల్లో కూడాగ్యాస్ ఆయిల్ వారు సర్వే చేశారు. ప్రస్తుతం ఆళ్లగడ్డ తాలూకా శిరివెళ్ళ మండలము జీనేపల్లి గ్రామపొలాల్లో అదేవిధంగా అర్ధ రాత్రి వచ్చి సర్వే చేస్తారని గ్రామ రైతులు అంటున్నారు. సర్వే రిపోర్టును కూడా ఢిల్లీకి పంపుతున్నట్లు సర్వే చేసే వాళ్ళు చెబుతున్నారన్నారు. రైతులకు ముందస్తు సమాచారము ఇవ్వకుండా ఈ సర్వేలు ఏమిటని.... ? వారుప్రభుత్వాన్ని, మండల రెవిన్యూ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేసి తమకు తెలుపాలని కూడాజీనేపల్లి గ్రామ రైతులు రెవెన్యూ శాఖ అధికారులను కోరుతున్నారు.



## మిన్నంటిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు





- **ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్**

నంద్యాల,అఖండ సూర్యన్యూస్.నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పార్టీకి జై కొడుతూ ఉత్సాహంగా సాగారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం పార్టీ కార్యాలయంలో మంత్రి ఫరూక్ పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువుటద్దం తెలుగుదేశం పార్టీ అని అన్నారు .పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నందమూరి తారకరామారావు గారు 44 ఏళ్ల క్రితం ఈ పార్టీని స్థాపించారని నాటి నుండి నేటి వరకు టీడీపీ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని తెలిపారు.నాడు ఎన్టీఆర్ వేసిన పునాదిపై, నేడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి తెలుగు దేశం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు . నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను మోసిన కార్యకర్తలే మా బలం. వారి త్యాగాల వల్లే పార్టీ నేడు ఈ స్థాయిలో ఉందని . సీనియర్ నాయకుల అనుభవం, యువ నాయకత్వ ఉత్సాహం కలిసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ప్రతి కార్యకర్త పనిచేయాలని . ఎన్టీఆర్ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి క్రమశిక్షణతో, నిబద్ధతతో పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న పలువురు టిడిపి సీనియర్ నాయకులను మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించి వారితో కలిసి భోజనం చేశారు . పార్టీ అభివృద్ధిలో వారి పాత్ర చిరస్మరణీయమని తెలిపారు ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దిదేకుల దస్తగిరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొప్పుల శివ నాగిరెడ్డి, కంచర్ల సురేష్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, జైనాబి, శ్రీదేవి, నాగార్జున, దేవస్థానాల చైర్మన్లు చలం బాబు, డాక్టర్ అనిల్ కుమార్, బెండకాయల ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో**

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.



## ఎర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి వేలంపాటలో రికార్డు స్థాయిలో పెరిగిన ఆదాయం



**ఆళ్లగడ్డ, అఖండ సూర్య :**

ఆళ్లగడ్డ తాలూకాలోనిశిరివెళ్ళమండలము యర్రగుంట్ల మేజర్ పంచాయతీ వేలంపాటలో శనివారం రికార్డు స్థాయిలో ఆదాయం పెరిగిందని గ్రామ సర్పంచ్ సత్తార్ ప్రతాపరెడ్డి, అధ్యక్షతన నిర్వహించిన వేలంపాటలకు డి ఎల్ పి ఓ రాంబాబు, ఈ ఓపి ఆర్ డి శ్రీనివాసులుశర్మలు తెలిపారు.సంత మార్కెట్ , కళేబరాలకు, దిన మార్కెట్ కు మొత్తం కలిపి రూ.19,35000 రూపాయలు రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా శిరివెళ్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు కమతం లక్ష్మి రెడ్డి, మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, పాటదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఆటో డ్రైవర్లకు యం.వి. ఐ. ఇన్స్పెక్టర్ రవిశంకర్ నాయక్ కౌన్సిలింగ్

**ఆళ్లగడ్డ,మార్చి29, అఖండ సూర్య**

ఆళ్లగడ్డ మండలంలో ఆటోల నందు కెపాసిటీకి మించి ఎక్కువ మందిని తీసుకొని ఆటో నడుపుతున్నందున ప్రమాదాలు జరగవచ్చునని ముందు జాగ్రత్త చర్యగా నంద్యాల యం.వి. ఐ. ఇన్స్పెక్టర్ రవిశంకర్ నాయక్ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి తగిన సూచనలు చేశారు. రోడ్డుపై వెళ్లుచున్న ఆటోలను ఆపి వారికి ఆరుగురు కంటే మించి ఎక్కువగా ఆటో ఎక్కించుకున్న ఎడల కేసులు పెట్టి కోర్టుకు అప్పగించివాళ్ళ లైసెన్స్ కూడారద్దు చేయబడునని ఆయనఆటో డ్రైవర్లను హెచ్చరించారు. అలాగే ఆటో డ్రైవర్ ఖచ్చితంగా కాకి యూనిఫామ్ ధరించవలెనని ఆయన ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల గురించి వివరించి వాళ్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ




- **నగరపాలక సంస్థ కమిషనర్**

**అఖండ సూర్య కర్నూలు**

కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా https://Meekosam.ap.gov.in వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

# హాయిగా కునుకు స్లీప్ టూరిజానికి యువత సై



బిజీబిజీ జీవితం..అంతా.. గజిబిజి గందరగోళం. తీరికలేని పని.. మానసిక ఒత్తిడిని పెంచేస్తున్నది. అనారోగ్యానికి ఆహ్వానం పలుకుతున్నది. తగినంత విశ్రాంతి దొరక్క.. మనశ్శాంతి దూరమైపోతున్నది. మొత్తంగా.. కంటినిండా నిద్రే కరువైపోతున్నది. ఎక్కువ ఒత్తిడితో నడిచే జీవితంలో చాలా మంది ప్రశాంతమైన నిద్ర కోసం ప్రత్యేకంగా ట్రిప్ ప్లాన్ చేస్తున్నారు. అవును ఇప్పుడు కొత్త ప్రదేశాలను చూడటానికి కాకుండా నిద్ర పూర్తిగా పొందేందుకు పర్యటనలు జరుగుతున్నాయి. ఈ ట్రెండ్ ఎందుకు పెరుగుతోందో..తెలుసుకుందాం.



సాధారణంగా మనం టూరిజం అనగానే కొత్త ప్రదేశాలు చూడడం, సాహసాలు చేయడం లేదా ప్రకృతి అందాలను ఆస్వాదించడం అనుకుంటాం. అయితే 'స్లీప్ టూరిజం' అంటే కేవలం విశ్రాంతి తీసుకోవడం, నిద్రపోవడమే ప్రధాన ఉద్దేశం. వారమంతా కష్టపడి పని చేసిన వాళ్ళు తమకి ప్రశాంతత అవసరమని భావించే వాళ్ళు వీకెండ్‌లో స్లీప్ టూరిజానికి వెళ్తున్నారు. ఇది పూర్తిగా విభిన్నమైన ట్రెండ్, కొత్తగా పుట్టుకొస్తున్న మార్పు. ఇది ప్రయాణానికి సంబంధించిన కొత్త కార్యకలాపం. దీనిని న్యాప్‌కేషన్స్ లేదా ఎన్‌ఎపి హాలిడేస్ అని కూడా పిలుస్తారు.

ప్రస్తుతం 'స్లీప్ టూరిజం' అనే కొత్త ట్రెండ్ వేగంగా విస్తరిస్తోంది. ప్రయాణం, వసతికి వేలు, లక్షలు తగిలెయ్యాలా..? అని తేలిగ్గా తీసేయకండి . మానసిక ప్రశాంతత కోసం ఎంత దూరం వెళ్లడానికైనా ఈతరం సిద్ధం. సుఖ నిద్ర కోసం ఎంతైనా వెచ్చిస్తామంటున్నారు. అయితే నిద్రకు అంత సీన్ ఉందా? అంటే.. నిత్యం బాస్‌తో చీవాట్లు తింటూ.. కలలోనూ పనే అంటూ కలవరించే ఓ యువోద్యోగిని అడిగి చూడండి. వాళ్లకు అది ఎంత ముఖ్యమో చెబుతారు. మార్కుల ఒత్తిడితో సతమతమయ్యే ఓ కాలేజీ అమ్మాయి,అబ్బాయిని పలకరించండి.. వారికి కునుకు ఎంత అమూల్యమో చెబుతారు. ఇదీగాక ఆరోగ్యం, ప్రశాంతత కోరుకునే వారు కూడా అది అవసరమే అంటారు.

'స్లీప్ టూరిజం' అనుభూతిని కేరళలోని అలెప్పీ, హిమాచల్ ప్రదేశ్‌లోని నాకో, పశ్చిమ బెంగాల్‌లోని దువార్స్ ,సిక్కిం రాజధాని గ్యాంగ్‌టాక్‌కు సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉండే పెల్లింగ్ లో పొందొచ్చు. ఈ టూర్ చేసేవాళ్లు ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను ఆస్వాస్తూ,ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ.. మానసిక ప్రశాంతతను పొందుతారు. ఇలాంటి టూర్లలో ఎక్కువగా యోగా సెషన్లు, స్విమింగ్, స్పా చికిత్సలు, ఆరోగ్యకరమైన భోజనంతోపాటు నిద్రకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని హోటల్స్ నిర్వాహకులు కూడా వీరికి తగిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. అతిథులకు నిద్రాభంగం కలగకుండా.. గదులను సౌండ్‌ప్రూఫ్‌గా మార్చేస్తున్నారు. తాజాగా, ఈ ట్రెండ్‌పై స్కై స్కానర్ సంస్థ ఓ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా 70 శాతం మంది భారతీయులు 'స్లీప్ టూరిజానికి' ఆసక్తి చూపుతున్నారని తేల్చింది. వీరిలో 57 శాతం మంది సెలవు దినాల్లో ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని వెల్లడించింది.





# ఈ చిన్న జీవులంటే ఏనుగులకు చచ్చేంత భయం..!



సాధారణంగా ఏనుగులకు ధైర్యం ఎక్కువ. సింహాలను సైతం ఎదిరించి మరి ముందుకు సాగుతుంటాయి. కానీ ఈ ఏనుగులకు చిన్నప్రాణులైన "తేనెటీగలు" అంటే చాలా భయమని మీకు తెలుసా..?

ఓ చిన్న తేనెటీగ అంటేనే ఏనుగుకు భయమా ..? నిజంగా ఇది నిజమే. అవును. ఎంత పెద్ద ఏనుగులైనా చిన్నపాటి కందిరీగలు, తేనెటీగలు చెవుల్లోకి దూరి పెట్టే బాధను, వాటి కాట్లను తలచుకుంటేనే జడుసుకుంటాయి. కాబట్టి, కందిరీగలు, తేనెటీగలున్న ప్రాంతాలకు వెళ్ళేందుకు ఇవి ఏ మాత్రం సాహసించవు.



తేనెటీగలు గుంపులుగా దాడి చేసి ఏనుగును కూడా భయపెడతాయి. తేనెటీగల మిన్ను వినగానే ఏనుగులు పరుగులు తీస్తాయని పలువురు పరిశోధకులు పేర్కొన్నారు. కొన్ని తేనెటీగలు ఏనుగుల చెవుల్లోకి చొరబడి.. తీవ్రమైన బాధను కలిగిస్తాయి. తేనెటీగల కాట్లు ఏనుగుల చెవులు, కళ్ల చుట్టూ ఉన్న సున్నితమైన చర్మంపై పడితే తీవ్ర నొప్పి కలుగుతుంది. కొన్ని దేశాలలో ఏనుగుల బారి నుండి పంటపొలాలను రక్షించుకునేందుకు రైతులు తేనెటీగల పెంపకం చేపట్టారంటేనే.... ఏనుగులు ఎంతగా వాటికి భయపడతాయో అర్థం చేసుకోవచ్చు.

అలాగే, ఏనుగులు ఏదైనా సరే వాసనను చూసి ఇట్టే గుర్తుపడతాయి. గుర్తుపట్టడమేగాకుండా వాటిని జీవితకాలం గుర్తు పెట్టుకుంటాయి కూడా. అంత పెద్దదైన, బలమైన జంతువుకీ ఒక చిన్న తేనెటీగ భయాన్నిస్తుందంటే అది మానవ జీవనానికీ ఒక ఉపమానంలా ఉంటుంది. జీవితంలో ఎవరు చిన్నవారు, ఎవరు పెద్దవారు అనే కంటే, ఎవరు ఎంత తెలివిగా, సమర్థంగా వ్యవహరిస్తారు అన్నదే ముఖ్యం. ప్రకృతి ఈ సమతుల్యతను అద్భుతంగా నిలబెడుతుంది.



# చెడు ప్రవర్తన కలిగితే జిల్లా బహిస్కారనే

- **ఇప్పటివరకు 20 మంది జిల్లా బహిష్కరణ .**

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో**

కర్నూలు జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా బహిష్కరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు చెడు ప్రవర్త కలిగిన 10 మందిపై జిల్లా బహిష్కరణ చేపట్టినట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ . సిరి , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆది వారం తెలిపారు. అందులో భాగంగా ఆదివారం మరో వ్యక్తిని జిల్లా బహిష్కరణ చేశారు. ఆదివారం జిల్లా బహిష్కరణకు గురైన ఈ వ్యక్తి కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్నూలు మండలం, బుధవారపేట లో నివాసం ఉంటున్న వ్యక్తి పోలిశెట్టి అశోక్ , చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో ఈ వ్యక్తి పై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, ఆదివారం జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో పోలిశెట్టి అశోక్ పై రౌడీషీట్ నెంబర్ 340 ఉంది.క్రిమినల్ కేసులలో నిందితులుగా ఉన్నారు. ఈ వ్యక్తి పై గతంలో తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్యలకు సంబంధించిన కేసుల్లో పాల్గొన్నట్లు గుర్తించినందున , ప్రజల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉన్న నేపథ్యంలో చట్టపరమైన నిబంధనల ప్రకారం జిల్లా బహిష్కరణ విధించినట్లు తెలిపారు. పై తెలిపిన కేసుల్లో పలు మార్లు రిమాండ్ కు వెళ్లినప్పటికీ కూడా ఇతడి ప్రవర్తనలో ఎటువంటిమార్పు రాకపోగా, మరి ఎక్కువగా వివిధ రకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ప్రతిపాదనల మేరకు ఇతని క్రిమినల్ రికార్డులను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదివారం ఈ వ్యక్తి పై జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు చెడు నడత కలిగిన 9 మంది వడ్డే రామాంజనేయులు , పటాన్ ఇమ్రాన్ ఖాన్, వడ్డే తులసి కుమార్, వడ్డే రేవంత్ కుమార్, వడ్డే శివ కుమార్ ,మిట్టగేరి కుర్వ వెంకటేశ్వర్లు ,కుర్వ మధు అలియాస్ పుండుకూర మధు,మిట్టగేరి కుర్వ మధుసూధన్ అలియాస్ మధు ,పోలిశెట్టి అశోక్ ల పై జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసామన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలుగజేసే వారి పై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని, అరాచక శక్తులుగా మారి , ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలుగ జేసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారి పై జిల్లా బహిష్కరణతో పాటు గా పీడి యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించామన్నారు., ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఇటువంటి చెడు నడత కలిగిన చాలా మంది పేర్లు జిల్లా బహిష్కరణ పరిశీలనలో ఉన్నాయని, మంచి ప్రవర్తనతో జీవించాలని కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.



## కంచి కామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వాముల వారిని కలిసిన అహోబిలం అఖిల బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంనిర్వాహకులు

**ఆళ్లగడ్డ, మార్చి29, అఖండ సూర్య**

అహోబిలం క్షేత్రంలో నిర్వహిస్తున్న అఖిల బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం నిర్వాహకులు మరియుశ్రీ సరస్వతీ విద్యా పీఠం అధికారి,కానాల మాధవరావు, అధ్యక్షులు వెల్లాల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి కె సుబ్బారావు, వెంకోబరావు లు తిరుపతి లో కంచి కామ కోటిపీఠాధిపతులు శ్రీ శ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వాముల వారిని దర్శించుకున్నారు అనంతరము వారంద రూకంచి కామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వాముల వారి ఆశీస్సులను తీసుకున్నారు.

## ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం



**అఖండ సూర్య కర్నూలు బ్యూరో.**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా జరిగింది .ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాలలో టిడిపి నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కర్నూలు ,నంద్యాల తో పాటు కోడుమూరు ,ఎమ్మిగనూరు, మంత్రాలయం ,ఆదోని, ఆలూరు, పత్తికొండ, బనగానపల్లె ,డోన్ ,ఆళ్లగడ్డ, నందికొట్కూర్, ఆత్మకూరు పాణ్యం నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలలో టిడిపి జెండాను ఆవిష్కరించి పార్టీ ఆవిర్భావం గురించి ఆ పార్టీ నాయకులు వివరించారు . ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కు నివాళులర్పించారు. ఇదే సందర్భంగా ఎన్టీ రామారావు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పలుచోట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణసంచాపేల్చారు. అలాగే స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## కార్యకర్తల వివాహ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ ఇంచార్జ్ సోదరులు



**అఖండ సూర్య మంత్రాలయం :**

మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు సోదరులు ఎన్. రఘునాథ్ రెడ్డి మరియు తనయుడు రాజారెడ్డి మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని చిన్న భూంపల్లి,గంగులపాడు గ్రామాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల వివాహ వేడుకలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకులంలో ఆకస్మిక తనిఖీ

- **విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల భిక్షం**

**ఆదోని, అఖండ సూర్య ప్రతినిధి:**

ప్రభుత్వం అందిస్తున్న విద్య, వసతి, ఆరోగ్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటేనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల భిక్షం (దాసు) పేర్కొన్నారు. ఆదివారం ఆదోని మండలం అరెకల్ గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. హాస్టల్ గదులు, భోజనశాల, వంటగది, నిల్వ గది (స్టోర్ రూమ్)లను స్వయంగా పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం మెనూ ప్రకారం ఉందా? నాణ్యత ఎలా ఉంది? అనే అంశాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆహారంలో పోషక విలువలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటిస్తూ వారి అభ్యాస పరిస్థితులు, ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు జరుగుతున్నాయా? పాఠాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన జరుగుతుందా? వసతి సౌకర్యాలు సరిపోతున్నాయా? వంటి అంశాలపై ప్రశ్నించారు. కొన్ని సమస్యలను విద్యార్థులు తెలియజేయగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మేకల భిక్షం, ప్రతి విద్యార్థి విద్యలో ముందుండేలా, ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా బాలికల భద్రత, పోషకాహారం, నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. తనిఖీ అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తిగా అల్పాహారం చేయడం ద్వారా ఆయన సరళ స్వభావాన్ని చాటుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మెలిగి వారికి ప్రోత్సాహం నింపారు. "మీరు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారు" అంటూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి వెంకట రాముడు, ప్రిన్సిపాల్ ఉమాకుమారి, వసతి గృహ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ తనిఖీతో గురుకులాల్లో సౌకర్యాల మెరుగుదలకు మరింత వేగం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రభుత్వ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- **ఎస్సీ కమిషన్ సభ్యులు**

**అఖండ సూర్య ఆదోని ప్రతినిధి:**



ప్రభుత్వం అందిస్తున్న విద్యా, వసతి, ఆరోగ్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల భిక్షం విద్యార్థులను ప్రోత్సహించారు. ఆదివారం ఆదోని మండలం అరెకల్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం బాలికల వసతి గృహాన్ని ఎస్సీ కమిషన్ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ.. రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు జరుగుతున్నాయా? వసతులు సక్రమంగా ఉన్నాయా? అధ్యాపకులు పాఠాలు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారా? అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా, వసతి గృహంలో అందిస్తున్న భోజనంపై కూడా విచారణ చేసి, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా అని పరిశీలించారు. భోజన హాల్, వంటగది, స్టోర్ రూమ్‌లను స్వయంగా తనిఖీ చేసి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మేకల భిక్షం, ప్రతి విద్యార్థి ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీ అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తిగా అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) చేయడం ద్వారా వారికి ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ వెంకట రాముడు, ప్రిన్సిపల్ ఉమాకుమారి,

# ఘనంగా 44వ టిడిపి పార్టీ ఆవిర్భావ వేడుకలు

**దేవనకొండ,( అఖండ సూర్య ప్రతినిధి )**



దేవనకొండ మండలంలోని తెర్నేకల్ గ్రామంలో టిడిపి నాయకులు ఘనంగా 44వ టిడిపి ఆవిర్భావ వేడుకలను కోలంట్ల తిమ్మప్ప ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం జెండా ఆవిష్కరించి బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోలంట్ల తిమ్మప్ప మాట్లాడుతూ... భారతదేశంలోనే క్రమశిక్షణకు నీతి నిజాయితీ పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. తెలుగు జాతి గుండెచప్పుడును ఢిల్లీకి తెలిసేలాగా చాటి చెప్పినా గొప్ప పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ఇలాంటి పార్టీకి కార్యకర్తలుగా పనిచేస్తున్నందుకు మాకు గర్వంగా ఉందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల కొరకు ఎన్నో విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలు అందించే గొప్ప పార్టీ టిడిపి ది అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం రకాలుగా అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగ యువతకు అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించిందన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రం నిరుద్యోగ సమస్య ఉండదని, ఏపీని దేశంలోనే ఉన్నత రాష్ట్రంగా విద్య ఎందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్న వెంకప్ప, బాట మీద రాజు, ఆదోని భాస్కర్, కోలంట్ల శంకర్, బి. సురేంద్రబాబు, గోమారి రంగప్ప, చైర్మన్ వీరేష్, బి లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

# ముద్దాయి అరెస్టు

- **42 తులాల బంగారు ఆభరణాలు స్వాదినం**
- **నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**




**అఖండ సూర్య నంద్యాల ప్రతినిధి**

సోహైల్ ఖాన అలియాస్ సమీర్ ఖాన్ అలియాస్ షోహైబ్ బిన్ మునాఫ్ ఖాన్ అలియాస్ జహీర్ ఖాన్, వయస్సు 38 సంవత్సరాలు, తండ్రి పేరు మునాఫ్ ఖాన్, ఇలియాస్ మసీదు దగ్గర, గెద్దలహళ్లి, వినాయక నగర్, నాగవార, బెంగళూరు నార్త ను ఆత్మకూర్ నుండి వెలుగోడుకు వెళ్ళుదారిలో వెలుగోడు వద్ద గల ఎస్ ఆర్ బి సి కెనాల్ ప్రక్కన అరెస్టు చేసి అతని నుండి ఆత్మకూరు , నంద్యాల ఒకటవ టౌన్ రెండు కేసులలో కలిపి మొత్తం 42 తులాల బంగారు ఆభరణాలు (విలువ సుమారు 65 లక్షలు ) సీజ్ చేసినట్టు ఎస్పి తెలిపారు. 2025వ సంవత్సరము లో ఆత్మకూర్ , నంద్యాల 1 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలలో పగటిపూట కన్నపు దొంగతనాలకు పాల్పడుతూ పోలీస్ లకు దొరకకుండా తప్పించుకొని తిరుగుతున్న సోహైల్ ఖాన్ అలియాస్ సమీర్ ఖాన్ అలియాస్ షోహైబ్ బిన్ మునాఫ్ ఖాన్ అలియాస్ జహీర్ ఖాన్, తండ్రి పేరు మునాఫ్ ఖాన్, ఇలియాస్ మసీదు దగ్గర, గెద్దలహళ్లి, వినాయక నగర్, నాగవార, బెంగళూరు నార్త్ దగ్గర నం .01లో నివాసం అనువ్యక్తిని ఆదివారం నంద్యాల జిల్లా ఆత్మకూర్ నుండి వెలుగోడుకు వెళ్ళుదారిలో వెలుగోడు వద్ద గల ఎస్సార్ బీసీ కెనాల్ ప్రక్కన గల చెట్ల క్రింద అదుపులోకి తీసుకున్నారు. జల్సాలకు అలవాటు ఆత్మకూర్ , నంద్యాల టౌన్ నందు పగటి పూట కన్నపు దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్మును వెలుగోడు దగ్గర గల ఎస్సార్ బీసీ కెనాల్ దగ్గర దాచిపెట్టినాడు.ఇతనిపై గతంలో కూడా కుప్పం మరియు పెనుకొండ కర్ణాటక రాష్ట్రంలోని పెన్షన్ మొహాళ్ల పోలీస్ స్టేషన్ పరిదిలలో కేసులు ఉన్నాయి. పెన్షన్ మొహాళ్ల పోలీస్ స్టేషన్ లోని కేసులలో జైలుకు వెళ్ళి వచ్చినాడు. ఇతను చాలా రోజుల నుండి ఆత్మకూర్ మరియు నంద్యాల కేసులలో ముద్దాయి అయినప్పటికి ఎవరికి దొరకకుండా తప్పించుకొని తిరుగుతు నేరములు చేస్తూ ఉన్నాడు. పై కేసులను చేదించేందుకు కర్నూలు రేంజ్ డి ఐ జికోయ ప్రవీణ్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు, ఆత్మకూర్ సబ్ డివిజన్ డి.ఎస్.పి .రామంజీనాయక్ ఆద్వర్యంలో ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ . మహేశ్వర రెడ్డి, ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ ఆత్మకూర్ ఎస్సై నారాయణ , ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి ముద్దాయి కొరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాలింపు చర్యలు చేపట్టి ముద్దాయిని అరెస్ట్ చెయ్యడం జరిగింది. దొంగతనం కేసులో ముద్దాయిని కనుగొని అరెస్ట్ చేయుటలో కృషిచేసి పై సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

- **టిడ్కో గృహాల ప్రారంభం.**
- **జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**అఖండ సూర్య నంద్యాలప్రతినిధి:**

సోమవారం నాడు నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం తెలిపారు. అదే రోజు ఉదయం టిడ్కో గృహాల ప్రారంభోత్సవం, మధ్యాహ్నం పి4 కార్యక్రమం నిర్వహణ ఉండటంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేయాల్సి వచ్చినట్లు ఆమె వెల్లడించారు. అయితే, డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ పట్టణాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను సంబంధిత కార్యాలయాల్లో ప్రత్యక్షంగా సమర్పించవచ్చని, లేదా ఆన్లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా కూడా వినతులను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి అనవసరంగా నంద్యాల జిల్లా కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.





## వధూవరులను ఆశీర్వదిస్తున్నఎమ్మెల్యే భూమా అఖిలప్రియా

**ఆళ్లగడ్డ,మార్చి29,,అఖండ సూర్య,**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డతాలూకా చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన భూమా కుటుంబ అభిమాని కోటు చిన్న నరసింహుని కుమారుడి వివాహానికి ముత్యాలపాడు గ్రామానికి ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమాఅఖిలప్రియా చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో:-**

సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## అత్తను చంపిన అల్లుడు

**నంద్యాల, అఖండ సూర్యన్యూస్.**

అడ్డువచ్చిన అత్త కళావతమ్మ(40)ను అల్లుడు కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన బండిఆత్మకూరు మండలం, కడమల కాలువ గ్రామంలో చోటుచేసుకుంది.నంద్యాల జిల్లా, బండిఆత్మకూరు మండలం, కడమల కాలువ గ్రామానికి చెందిన సునీల్, ఎస్తేరు లు గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరిది ఒకే ఊరు కావడంతో ఇరు కుటుంబాల వారు వారికి పెద్దల సమక్షంలో పెళ్లి జరిపించారు.వారికి ఒక అమ్మాయి, ఒక బాబు వున్నారు. నిందితుడు వృత్తి రీత్యా పెయింటింగ్ పనులకు వెళ్లి వస్తుంటారు. అయితే నిత్యం మద్యం సేవించి భార్యతో గోడవపడేవారని పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి భార్యతో గొడవ పడటంతో పుట్టింటి వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళింది. అక్కడికి చేరుకున్న భార్యపై దాడికి ప్రయత్నించగా మృతురాలు అడ్డువచ్చినట్లు తెలుస్తుంది. చేతిలో వున్న కత్తితో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన మృతురాలిని బంధువులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న సి ఐ ఈశ్వరయ్య,ఎస్ ఐ జగన్మోహన్ లు ఆసుపత్రి వద్దకు చేరుకుని పూర్తి వివరాలు సేకరించి కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు చెంచుగుడేనికి కలెక్టర్, ఎమ్మెల్యే

**నంద్యాల ప్రతినిధి, అఖండ సూర్య న్యూస్.**

నంద్యాల జిల్లా, బండిఆత్మకూరు మండల పరిధిలోని నెమల్లకుంట చెంచుగుడేనికి జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనీయ, శ్రీశైల నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి లు వస్తున్నట్లు సమాచారం. చెంచు గుడెం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన లు, ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిసింది.



# గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

- కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

**అఖండసూర్య, హైదరాబాద్**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు, వేలాది మంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ వివరించారు. ''కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.



# అనుమతి లేకుండా హార్ముజ్ జలసంధిని దాటిన ఆయిల్ ట్యాంకర్పై ఇరాన్ దాడి

**న్యూఢిల్లీ**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. తమ వద్ద ముందస్తు అనుమతి తీసుకోకుండా హార్ముజ్ జలసంధి మార్గాన్ని వినియోగించవద్దని హెచ్చరించిన ఇరాన్, తాజాగా ఒక భారీ ఆయిల్ ట్యాంకర్పై దాడి చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. అనుమతి లేకుండా ప్రయాణిస్తున్న ఆ నౌకను ఇరాన్ బలగాలు లక్ష్యంగా చేసుకుని పేల్చివేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ మంటల్లో చిక్కుకుని కాలిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి మార్గం గుండా రోజూ వందలాది నౌకలు ప్రయాణిస్తుంటాయి. ఈ మార్గం ద్వారా ఆసియా, యూరప్ దేశాలకు చమురు సరఫరా జరుగుతుంది.



# గెలుపు నిర్ణయించేది వారే

**కోల్ కత్తా**

సరిగ్గా నెల రోజుల తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నాలుగోసారి విజయం సాధించాలనిచూస్తోంది. బీజేపీ త్రణమూల్‌కు బ్రేక్ వేయాలని చూస్తోంది. బెంగాల్ రాజకీయాలను శాసించే కీలకమైన శక్తి ముస్లిం సమాజం. బెంగాల్ రాజకీయాలను ఏడు దశాబ్దాలుగా శాసిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా 1951లో 19.6 శాతం ఉండేవారు. ప్రస్తుతం 33 శాతానికి పెరిగారు. అంటే దాదాపు రెంట్టింపు అయ్యారు. 85 స్థానాల్లో వీరే విజేతలను నిర్ణయిస్తారు, మరో 30?40 సీట్లలో ప్రభావం చూపుతారు. మొత్తం 120 నియోజకవర్గాల్లో వారి ఆధిపత్యం రాజకీయాలను శాసిస్తుంది.ముర్షీదాబాద్‌లో 46 శాతం, మాల్దాలో 51 శాతం, పశ్చిమ దినాజ్‌పూర్‌లో 50 శాతం, వీర్‌భూమిలో 50 శాతం, దక్షిణ 24 పర్గణాల్లో 30 శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతాల్లో 85 స్థానాల్లో ముస్లిం అభ్యర్థులనే పార్టీలు బరిలో దింపుతాయి. వారే గెలుస్తారు. మరో 30 స్థానాల్లో ముస్లింల మద్దతుతో ఇతర మతాల అభ్యర్థులు గెలుస్తారు. ముస్లింలు ఓట్లు వేయకుంటే ఓడిపోతారు.దేశ విభజన తర్వాత కాంగ్రెస్, తర్వాత కమ్యూనిస్టుల వైపు ముస్లిం ఓట్లు మళ్లాయి. భూసంస్కరణలు, పాఠ్యపుస్తకాల మార్పులు, ఓబీసీలో 66 ముస్లిం కులాలు చేర్చడం ద్వారా వారిని బలోపేతం చేశారు. 2011 నుంచి తృణమూల్ వైపు మళ్లారు. ఇటీవల 36 ఉప కులాలను బీసీలో చేర్చి 35 ముస్లింలవి, ఉర్దూ రెండో అధికారిక భాషగా గుర్తింపు, ఇమామ్‌లకు వేతనాలు ప్రకటించింది. 2006లో కమ్యూనిస్టులు 102, 2021లో ఖీఓఇ 95 సీట్లు ఈ ఓట్లతోనే గెలిచాయి. ఎంఐఎం, ఐఎస్ఎఫ్ (ఇమామ్ అబ్బాస్), ఆల్ జనతా ఉనయన్ (మాజీ ఎంపీ ప్రారంభం) పార్టీలు ఈసారి అభ్యర్థులను పోటీలో దించాయి. ముస్లిం బలంగా ఉన్న ప్రాంతాల్లో వీటి ప్రభావం టీఎంసీ సీట్లను 20 వరకు తగ్గించే అవకాశం ఉంది.ఈసారి ఎన్నికల్లో టీఎంసీకి బీజేపీ బ్రేక్ చేయాలని చూస్తోంది, ముస్లిం ఓట్ల చీలిక ఇందుకు దోహదపడే అవకాశం ఉంది. 20 మంది ముస్లింలు గెలిస్తే ఫలితాలు మారతాయి. ముస్లిం పార్టీల పోటీ ఓటు బ్యాంకును విభజించి, బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం రాస్తాయి.

# గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో పాకిస్థాన్ అగ్రస్థానం

**అఖండసూర్య, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం దానికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తోంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జీటీఐ) 2026 ప్రకారం, ఉగ్రవాదం వల్ల అత్యంత ఎక్కువగా ప్రభావితమైన దేశంగా పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదికలోని గణాంకాలు పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాల వైఫల్యాలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. గ్రీక్ సిటీ టైమ్స్ తన కథనంలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సూచీలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. 2025 సంవత్సరంలోనే దేశంలో 1,045 ఉగ్రదాడులు జరిగాయని, వాటిలో 1,139 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది. మరో 1,595 మంది గాయపడగా, 655 మందిని ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. ఇండెక్స్‌లో 8.574 స్కోరుతో పాకిస్థాన్ అన్ని దేశాల కంటే ముందుంది. 2013 తర్వాత పాకిస్థాన్‌కు ఇదే అత్యంత హింసాత్మక సంవత్సరమని నివేదిక పేర్కొంది. ప్రపంచమంతటా ఉగ్రవాదం తగ్గుతుంటే, పాక్‌లో ఈ స్థాయి పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస భౌగోళికంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక గుర్తించింది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే 2025లో మొత్తం దాడుల్లో 74 శాతం, మరణాల్లో 67 శాతం నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు నిరంతర అస్థిరత, బలహీనమైన ప్రభుత్వ నియంత్రణతో ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్‌పాకిస్థాన్ సరిహద్దు వెంబడి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని విశ్లేషించింది. పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా పాక్షిక పాలనలో ఉండటం వల్ల అల్‌ఖైదా, హక్కానీ నెట్‌వర్క్, స్థానిక ఉగ్ర సంస్థలకు సురక్షిత స్వర్గధామంగా మారాయని నివేదిక వెల్లడించింది. డ్యూరాండ్ లైన్‌కు ఇరువైపులా ఉన్న జాతి, సామాజిక బంధాలు సరిహద్దులు దాటి ఉగ్రవాదుల కదలికలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల నిఘా, నియంత్రణ సంక్లిష్టంగా మారాయి. ప్రభుత్వ పాలన బలహీనంగా ఉన్న చోట ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఎలా పనిచేస్తాయో ఈ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని నివేదిక నొక్కి చెప్పింది. గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, నిర్మాణ లోపాల సంచిత ప్రభావమే పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితికి కారణమని గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ తేల్చి చెప్పింది. కొన్ని ప్రాంతాలలో దాడులు కేంద్రీకృతం కావడం, నిర్దిష్ట గ్రూపుల ప్రాబల్యం పెరగడం వంటివి పాక్ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడిని సూచిస్తున్నాయి. ఈ సూచీలో పాకిస్థాన్ అగ్రస్థానానికి చేరడం అనేది ఒక సుదీర్ఘ ప్రయాణం యొక్క ఫలితమని, ఈ పరిస్థితికి దారితీసిన అంశాలు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది.



# జార్ఖండ్‌కు బస్తర్ బలగాలు!

**అఖండసూర్య, ఛత్తీస్‌గఢ్**



నక్సల్ ముక్త్ ఛత్తీస్‌గఢ్ దాదాపుగా సఫలమైన నేపథ్యంలో బస్తర్ డివిజన్ నుంచి కేంద్ర బలగాల ఉపసంహరణ ప్రారంభమైంది. డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో ఒకటైన దంతేవాడ జిల్లా కటేకల్యాణ్ రోడ్డుపై ఏర్పాటు చేసిన జారమ్ సీఆర్పీఎఫ్ కోబ్రా దళాల క్యాంపును నిన్న ఎత్తివేసి ఆ బలగాలను జార్ఖండ్‌కు తరలించారు. ఏడు జిల్లాల్లో ఇప్పటికే బస్తర్, కొండగావ్ జిల్లాలు పూర్తిగా నక్సల్ ముక్త్ కాగా, దంతేవాడలో ఒకే ఒక్క మావోయిస్టు దాక్కొని ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అబూజ్మాడ్ ప్రాంతం ఉన్న నారాయణపూర్ జిల్లాలో ఇద్దరు, సుక్మాలో ఐదుగురు, బీజాపూర్ జిల్లాలో 11 మంది, అత్యధికంగా కాంకేర్ జిల్లాలో 19 మంది ఉన్నట్లు వివరిస్తున్నారు. అన్ని జిల్లాల్లో కలిపి ప్రస్తుతం 38 మంది మావోయిస్టులు ఉన్నట్లు, వీరిని కూడా లొంగుబాట పట్టించడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక ఆదివాసీ నేత పాపారావు సరెండర్ తర్వాత ఈ 38 మంది కూడా వచ్చే మూడు రోజుల్లో దారికి వస్తారని భావిస్తున్నారు. వీళ్ల లొంగుబాటు జరగ్గానే మిగతా జిల్లాల్లో ఉన్న క్యాంపులను కూడా ఎత్తివేసి జార్ఖండ్‌కు పంపిస్తారని ఛత్తీస్‌గడ్ మీడియా వర్గాల భోగట్టా.

**జనతాన సర్కార్ల రద్దు..**

కాగా, మావోయిస్టుల ఆధ్వర్యంలో గ్రామ, ఏరియా, జిల్లా స్థాయిలో ఏర్పడిన జనతన సర్కార్లు ఇప్పుడు వాటంతటకవే రద్దయ్యాయని తెలుస్తోంది. వీటి స్థానంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం గ్రామాల్లో తిష్ట వేసి రోడ్లు, ఆరోగ్యం, విద్య, ఉపాధి పనుల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అంటున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు సైతం ఒకప్పుడు నక్సల్స్ కు కోటలుగా ఉన్నమారుమూల గ్రామాలు పర్యటిస్తున్నారని, ప్రజలతో సంభాషిస్తున్నారని చెబుతున్నారు.


కేంద్ర హోం శాఖ వర్గాల సమాచారం ప్రకారం, దేశంలో మావోయిస్టులకు సంబంధించి ఇప్పటికీ 130 నుంచి 150 మధ్య సాయుధ క్యాడర్లు మిగిలి ఉన్నారు. వీరిలో పొలిట్‌బ్యూరో సభ్యులు గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు, మిసిర్ బెస్రా అలియాస్ సాగర్, మరికొందరు డివిజన్ స్థాయి నేతలు, కేడర్లు ఉన్నారు. ఈ 130150 మందిలో 100 మంది వరకూ జార్ఖండ్ రాష్ట్ర అడవుల్లోనే మిసిర్ బెస్రా నేతృత్వంలో పనిచేస్తున్నారని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వీరిని లొంగుబాట పట్టించేందుకు లేదా అంతమొందించేందుకు బస్తర్ నుంచి బలగాలను పంపుతున్నామని చెబుతున్నాయి. వీటిలో నాలుగు కోబ్రా దళాలు, మిగతా బలగాలు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీఎఫ్ దళాలు ఉన్నట్లు వివరించాయి. పొలిట్‌బ్యూరో సభ్యుడు గణపతి లొంగుబాటుపై సస్పెన్స్ డ్రామా ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ విషయంలో వివిధ మీడియా సంస్థలు, యూట్యూబ్ చానెళ్లు రకరకాల ఊహాగానాలు చేస్తున్నాయి. ఆయన తెలంగాణ ఎస్ఐబీతో టచ్‌లో ఉన్నాడని కొందరు.. ఇప్పటికే లొంగిపోయాడని, 31న ఆయన లొంగుబాటు చూపిస్తారని మరికొందరు చెబుతున్నారు. ఆయన ఏ పోలీసుల అదుపులో లేడని, లొంగిపోయే అవకాశం కూడా లేదని మరికొందరు స్పష్టం చేస్తున్నారు. ఏమైనా దేశాన్ని మావోయిస్టు ముక్త్‌గా ప్రకటించాలంటే అటు మిసిర్ బెస్రా, ఇటు గణపతి లొంగిపోవడమో లేక అంతం కావడమో జరగాల్సిందేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆదివాసీ సౌకర్య కేంద్రాలు..**

ఇలా ఎత్తేసిన క్యాంపుల స్థానంలో ఆదివాసీల సంక్షేమం కోసం పనిచేసే సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోం మంత్రి, డిప్యూటీ సీఎం విజయ్ శర్మ తెలిపారు. ఇక నుంచి భద్రతా వ్యవహారాలను రాష్ట్ర పోలీసు బలగాలు, డీఆర్జీ బలగాలు చూసుకుంటాయని కూడా ఆయన స్పష్టం చేసినట్లు అక్కడి మీడియా వర్గాలు చెబుతున్నాయి. కాగా, తాజా గణాంకాల ప్రకారం బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో సుమారు 96% ప్రాంతం ఇప్పుడు నక్సల్ ప్రభావం నుంచి విముక్తి పొందినట్లు భావిస్తున్నారు. కాంకేర్ జిల్లాలో రూపి అలియాస్ రంగబోయిన భాగ్య, బీజాపూర్-తెలంగాణ సరిహద్దుల్లో హేమ్లా బిచ్చా, సోఢీ కేశా దళాలు సంచరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మార్చి 31 గడువు ముగిసిన తర్వాత ఈ గ్రామాలన్నింటినీ ఒకేసారి లేదా కొన్ని కొన్ని గ్రామాల చొప్పున నక్సల్ ముక్త్‌గా ప్రకటించే అవకాశం ఉంది.

# రూ.10 కోట్లు ఖాతాలో పడితే... ఆ డబ్బు నాది కాదు, వెనక్కి తీసుకోండన్న మహిళ!

**అఖండసూర్య, ఉత్తరప్రదేశ్**



ఉత్తరప్రదేశ్‌లోని ఓ సామాన్య రైతు భార్య ఖాతాలో ఏకంగా రూ.10 కోట్లు జమ అయ్యాయి. అయితే, ఆశకు పోకుండా ఆమె చూపిన నిజాయతీ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఊహించని విధంగా వచ్చి పడిన కోట్లను చూసి చలించకుండా, ఇది తనది కాదని బ్యాంకుకు తెలిపేందుకు సిద్ధపడింది. వివరాల్లోకి వెళితే.. మైన్‌పురి జిల్లా, బిచ్వాన్ ప్రాంతంలోని దేవ్‌గంజ్ గ్రామానికి చెందిన రీతా అనే మహిళ నవరాత్రి అష్టమి రోజున బ్యాలెన్స్ చెక్ చేసేందుకు సమీపంలోని ఏటీఎంకు వెళ్లింది. తన ఖాతాలో రూ.9,99,49,588 ఉన్నట్లు చూసి షాక్ అయింది. అనుమానంతో మరో ఏటీఎంలో చెక్ చేయగా, అదే మొత్తం కనిపించింది. వెంటనే తన కుటుంబ సభ్యులను హెచ్చరించిన ఆమె, "ఈ డబ్బు మనది కాదు, ఒక్క రూపాయి కూడా తాకొద్దు" అని స్పష్టం చేసింది. ఆ రోజు బ్యాంకుకు సెలవు కావడంతో అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వలేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న కరీంగంజ్ బ్రాంచ్ మేనేజర్ రిషికాంత్ పాండే, ఇది సాంకేతిక లోపం వల్లే జరిగిందని, బ్రాంచ్ తెరిచిన తర్వాత దాన్ని సరిదిద్దుతామని తెలిపారు. రీతా నిజాయతీ గురించి తెలియగానే గ్రామస్థులు, చుట్టుపక్కల వారు ఆమెను అభినందించారు. ఆమె ఏటీఎంలో రికార్డు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా ఆమె సత్యసంధతను కొనియాడుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే ఓ సామాన్య కుటుంబం ఇంత పెద్ద మొత్తాన్ని చూసి చలించకపోవడం అందరికీ స్ఫూర్తినిస్తోంది.

# భారత్‌లో ఐఫోన్ ప్రియులకు షాక్

- పెరగనున్న పాత మోడళ్ల ధరలు!

**అఖండసూర్య**

భారత్‌లో ఐఫోన్ కొనాలనుకునే వారికి ఇది కొంత నిరాశ కలిగించే వార్త. టెక్ దిగ్గజం యాపిల్ తీసుకున్న ఒక కీలక నిర్ణయంతో పాత ఐఫోన్ మోడళ్ల ధరలు పెరగనున్నాయి. రిటైలర్లకు అందిస్తున్న ప్రోత్సాహకాలను నిలిపివేయడంతో, వినియోగదారులు ఐఫోన్ 14, 15 వంటి పాత సిరీస్ మోడళ్లపై సుమారు రూ.5,000 వరకు అదనంగా చెల్లించాల్సి రావచ్చు. ఇంతకాలం యాపిల్ తన ఆఫ్‌లైన్ రిటైల్ భాగస్వాములకు డిమాండ్ జనరేషన్ (డీజీ) సపోర్ట్ పేరుతో కొన్ని ప్రోత్సాహకాలను అందించేది. దీనివల్ల రిటైలర్లు ఫోన్ అధికారిక ధర (ఎంఆర్పీ)పై వినియోగదారులకు డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇవ్వగలిగేవారు. అయితే, ఇప్పుడు యాపిల్ ఈ సపోర్ట్‌ను నిలిపివేస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. దీంతో రిటైలర్లు ఇకపై భారీ తగ్గింపులు ప్రకటించే అవకాశం ఉండదు. ఈ నిర్ణయం వల్ల ఫోన్ల అధికారిక ధరలో ఎటువంటి మార్పు ఉండదు. కానీ, డిస్కౌంట్లు తగ్గడం వల్ల వినియోగదారుడు చెల్లించే తుది ధర పెరుగుతుంది. ముఖ్యంగా తక్కువ బడ్జెట్‌లో పాత ఐఫోన్ మోడల్‌ను కొనుగోలు చేయాలని భావించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో ధరలపై మరింత నియంత్రణ సాధించడం, పాత, కొత్త మోడళ్ల మధ్య ధరల వ్యత్యాసాన్ని తగ్గించి వినియోగదారులను కొత్త మోడళ్ల వైపు మళ్లించే వ్యూహంలో భాగంగానే యాపిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యాపిల్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



# ఐస్ క్రీమ్ విక్రేత తల నరికి ఇంటికి తీసుకెళ్లిన వ్యక్తి!

**అఖండసూర్య, ఉత్తరప్రదేశ్**

ఉత్తరప్రదేశ్‌లో అత్యంత పాశవికమైన, ఒళ్లు గగుర్పొడిచే ఘటన చోటుచేసుకుంది. బారాబంకి జిల్లాలో ఓ వ్యక్తి, ఐస్‌క్రీమ్ అమ్ముకునే యువకుడితో గొడవపడి, కొడవలితో అతని తల నరికాడు. అంతటితో ఆగకుండా, ఆ తలను తన ఇంటికి తీసుకెళ్లి, అసలేమీ జరగనట్టుగా దాని పక్కనే వంట చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పర్సావల్ గ్రామంలో శనివారం ఈ దారుణం జరిగింది. బబ్లు (25) అనే యువకుడు రోజులాగే సైకిల్‌పై ఐస్‌క్రీమ్ అమ్ముకునేందుకు గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో, అదే గ్రామానికి చెందిన శంకర్ యాదవ్ (50) అనే వ్యక్తితో అతనికి మాటామాటా పెరిగింది. ఈ వాగ్వాదం ముదరడంతో శంకర్ యాదవ్ తన వద్ద ఉన్న కొడవలితో బబ్లుపై దాడి చేసి, మెడను కోసి తలను మొండెం నుంచి వేరు చేశాడు. చుట్టూ జనం చూస్తుండగానే, నరికిన తలను చేత్తో పట్టుకుని శంకర్ యాదవ్ తన ఇంటికి తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న బరబంకి ఎస్పీ అర్పిత విజయవర్గీయ నేతృత్వంలో భారీ పోలీస్ బృందం గ్రామానికి చేరుకుంది. నిందితుడి ఇంటిని చుట్టుముట్టి లోపలికి ప్రవేశించగా, అక్కడ కనిపించిన దృశ్యం వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. శంకర్ యాదవ్ నరికిన తలను పక్కనే పెట్టుకుని, అసలేమీ జరగనట్టుగా వంట చేసుకుంటున్నాడు. పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, హత్యకు ఉపయోగించిన కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు బబ్లు తన కుటుంబానికి పెద్ద దిక్కు. ముగ్గురు సోదరులలో అతనే పెద్దవాడు. ఐస్‌క్రీమ్ అమ్మడం, ఇతర కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, చిన్న పిల్లలు ఉన్నారు. బబ్లు మరణ వార్త తెలియగానే ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. బబ్లు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలు వీరిద్దరి మధ్య వాగ్వాదానికి దారితీసిన కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి మానసిక స్థితిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# పారిశ్రామిక దిగ్గజం విజయ్‌పత్ సింఘానియా అస్తమయం

**అఖండసూర్య,**

ప్రముఖ వస్త్ర బ్రాండ్ రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత విజయ్‌పత్ సింఘానియా (87) కన్నుమూశారు. నిన్న సాయంత్రం ముంబైలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, రేమండ్ గ్రూప్ ప్రస్తుత చైర్మన్ గౌతమ్ సింఘానియా సోషల్ మీడియా ద్వారా ధ్రువీకరించారు. విజయ్‌పత్ సింఘానియా కేవలం పారిశ్రామికవేత్తగానే కాకుండా, సాహసవంతుడైన ఏవియేటర్‌గానూ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1988లో మైక్రోలైట్ విమానంలో లండన్ నుంచి న్యూఢిల్లీకి ఒంటరిగా ప్రయాణించి రికార్డు సృష్టించారు. 2005లో హాట్ ఎయిర్ బెలూన్‌లో దాదాపు 69వేల అడుగుల ఎత్తుకు వెళ్లి మరో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఆయన సేవలకు గానూ భారత ప్రభుత్వం 2006లో దేశంలోని మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. 1980 నుంచి 2000 వరకు ఆయన రేమండ్ గ్రూప్‌కు చైర్మన్‌గా సేవలు అందించారు.కొన్నేళ్ల క్రితం కంపెనీ యాజమాన్య హక్కులను తన కుమారుడికి బదిలీ చేసిన తర్వాత తండ్రీ కొడుకుల మధ్య ఆస్తి వివాదాలు తలెత్తడం గమనార్హం. అయితే, ఆ తర్వాత వారు సమస్యలను పరిష్కరించుకున్నట్లు సమాచారం. కాగా, ఆయన అంత్యక్రియలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ముంబైలోని చందన్‌వాడి శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబం ఒక ప్రకటనలో తెలిపింది. సింఘానియా ఒక దార్శనిక నాయకుడని, ఆయన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని కుటుంబం నివాళులర్పించింది.



## కెప్టెన్‌గా చరిత్ర సృష్టించనున్న

# ఇషాన్ కిషన్

వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ సారథ్యంలో సన్‌రైజర్స్ బరిలోకి దిగనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇషాన్ కిషన్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో అతడు ఓ అరుదైన రికార్డును అందుకోనున్నాడు.ఫస్ట్ మ్యాచ్‌లో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ టీమ్స్ తలపడనున్నాయి. అయితే సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయపడడంతో.. విధ్వంసరకర బ్యాటర్ ఇషాన్ కిషాన్ కెప్టెన్సీలో ఎస్ఆర్‌హెచ్ ఆడనుంది. ఇషాన్‌కి ఐపీఎల్ హిస్టరీలోనే ఫస్ట్ మ్యాచ్ ఇది. ఈ క్రమంలో ఈ స్టార్ బ్యాటర్ ఓ అరుదైన రికార్డును సృష్టించనున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహించిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించనున్నాడు. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 ఏళ్ల 253 రోజులు. ఇక ఓవరాల్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతి పిన్నవయసులో కెప్టెన్సీ వహించిన రికార్డు కివీస్ ఆటగాడు కేన్ విలియమ్సన్ పేరిట ఉంది. అతడు 27 ఏళ్ల 244 రోజుల వయసులో అంటే 2018లో ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించాడు. ఇప్పటి వరకు శిఖర్ ధావన్, మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ లు మాత్రమే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన భారత ఆటగాళ్లు. షాన్ కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించాలన్న జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం పై ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. అతడు ఆత్మవిశ్వాసం గల ఆటగాడని, నాయకుడిగా తనను తాను నిరూపించుకున్నాడని చెప్పుకొచ్చాడు.ఇషాన్ కిషన్ అండర్19 జట్టుకు, దేశవాళీలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తన రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో నాయకుడిగా తన జట్టుకు టైటిల్ అందించాడు.



# బ్యాడ్‌లక్ ప్లేయర్స్‌కు ఈ సీజన్‌లో కలిసొచ్చేనా!

ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో ఎందరో ఆటగాళ్లు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నారు. కానీ, వ్యక్తిగతంగా ఎంతో మంది దిగ్గజాలు పరుగుల వరద పారించినా, ఇప్పటికీ ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడలేకపోయారు. కోట్లాది రూపాయల పారితోషికం తీసుకుంటున్నప్పటికీ, విజేతగా నిలవలేకపోయిన ఆ 'దురదృష్టవంతులైన' ఆటగాళ్లగా మిగిలారు. ఐపీఎల్ చరిత్రలో ఏబీ డివిలియర్స్ ఓ సంచలనం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆయన అద్భుతమైన ప్రదర్శనలు చేశాడు. తన కెరీర్‌లో 5,162 పరుగులు సాధించిన ఈ దక్షిణాఫ్రికా దిగ్గజం, జట్టును ఫైనల్‌కు, ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ, తన సుదీర్ఘ కెరీర్‌లో ఒక్కసారి కూడా ట్రోఫీని ఎత్తలేకపోయాడు. అదే విధంగా 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ సైతం 142 మ్యాచ్‌ల్లో 4,965 పరుగులు చేసినా, 175 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడినా టైటిల్ సాధించలేకపోయాడు.2026 సీజన్ విషయానికి వస్తే, కొందరు ఆటగాళ్ల జీతాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్ సారథి రిషబ్ పంత్ 27 కోట్ల రూపాయల రికార్డు స్థాయి జీతంతో ఐపీఎల్‌లో అత్యధిక పారితోషికం పొందుతున్న ఆటగాడిగా నిలిచాడు. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఫైనల్ చేరినా, ముంబై చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇప్పటివరకు 125 మ్యాచ్‌ల్లో 3,553 పరుగులు చేసిన పంత్, ఈసారి లక్నో తరపున తన కల నెరవేర్చుకోవాలని చూస్తున్నాడు.కె.ఎల్. రాహుల్ ఐపీఎల్‌లో అత్యంత నిలకడైన ఆటగాడు. ఏడు సీజన్లలో 500కు పైగా పరుగులు సాధించి, మొత్తం 5,222 పరుగులు చేసినా ఆయనకు లీగ్ టైటిల్ దక్కలేదు. పంజాబ్, లక్నో జట్లకు నాయకత్వం వహించినా ఫలితం దక్కలేదు. మరోవైపు సంజూ శామ్సన్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 4,704 పరుగులు చేసిన సంజూ, రాజస్థాన్ రాయల్స్ నుంచి 18 కోట్ల రూపాయలకు చెన్నై సూపర్ కింగ్స్‌కు మారాడు. ఈ ఇద్దరు ఆటగాళ్ల ఉమ్మడి పారితోషికం 45 కోట్ల రూపాయలు కావడం గమనార్హం.




# చరిత్ర సృష్టించిన ఆర్సీబీ

ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన ఆర్సీబీ.. తొలి మ్యాచ్‌లోనే అదిరిపోయే విజయం సాధించింది. నిన్న (మార్చి 28) జరిగిన టోర్నీ ఓపెనర్‌లో సన్‌రైజర్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొంది, ఏకపక్ష విజయం నమోదు చేసింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని మరో 26 బంతులు మిగిలి ఉండగానే (15.4 ఓవర్లలో) ఛేదించడం ద్వారా ఓ భారీ రికార్డు నెలకొల్పింది. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 200 ప్లస్ టార్గెట్‌ను ఊదేసిన జట్టుగా చరిత్ర సృష్టించింది. గతంలో ఈ రికార్డు రాజస్థాన్ రాయల్స్ పేరిట ఉండేది. రాయల్స్ గత ఎడిషన్‌లో (2025లో గుజరాత్‌పై) 200 ప్లస్ లక్ష్యాన్ని 15.5 ఓవర్లలో ఛేదించింది. తాజాగా ఆర్సీబీ ఈ రికార్డును బద్దలు కొట్టింది. ఆర్సీబీ ఈ రికార్డు సాధించడంలో కింగ్ విరాట్ కోహ్లి కీలకపాత్ర పోషించాడు. భారీ ఛేదనలో విరాట్ తన సహజ శైలికి భిన్నంగా భారీ షాట్లతో అలరించి (38 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), మ్యాచ్‌ను వేగంగా ముగించాడు. గెలుపుకు 17 పరుగులు కావాల్సిన తరుణంలో విరాట్ వరుసగా 6, 4, 4, 4 బాది ఆర్సీబీ ఈ రికార్డు సొంతం చేసుకునేలా చేశాడు. ఆర్సీబీ ఈ రికార్డు సొంతం చేసుకోవడంలో దేవ్‌దత్ పడిక్కల్ (26 బంతుల్లో 61; 7 ఫోర్లు, 4 సిక్సర్లు), రజత్ పాటిదార్ (12 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా తమవంతు పాత్ర పోషించారు. వీరిద్దరు కూడా వేగంగా ఆడి కొండంత లక్ష్యాన్ని కరిగించారు. అంతకుముందు ఇషాన్ కిషన్ (38 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) విధ్వంసం, అనికేత్ వర్మ (18 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపుల కారణంగా సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోర్ చేసింది.

**ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన 200 ప్లస్ లక్ష్య ఛేదనలు..**

15.4 RCB vs SRH, బెంగళూరు, 2026*
15.5 RR vs GT, జైపూర్, 2025
16.0 RCB vs GT, అహ్మదాబాద్, 2024
16.3 MI vs RCB, వాంఖేడే, 2023
17.3 DC vs GL, ఢిల్లీ, 2017



# రెండేళ్ల నిషేధం సరిపోదు

- **బెన్ డకెట్‌పై గవాస్కర్ ఫైర్**

ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ బెన్ డకెట్ ఐపీఎల్ 2026 సీజన్ నుంచి ఆఖరి నిమిషంలో తప్పుకొన్న సంగతి తెలిసిందే. గతేడాది జరిగిన వేలంలో రూ. 2 కోట్లకు డకెట్‌ను ఢిల్లీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది సీజన్‌లో ఢిల్లీ ఇన్నింగ్స్ రాహుల్‌తో కలిసి డకెట్ ప్రారంభిస్తాడని అంతా భావించారు. కానీ డకెట్ మాత్రం అనూహ్యంగా ఈ ఏడాది సీజన్ నుంచి వైదొలిగి ఢిల్లీకి గట్టి షాకిచ్చాడు. ఇంగ్లండ్ తరపున టెస్టు క్రికెట్‌పై దృష్టి సారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డకెట్ తెలిపాడు.ఈ ఇంగ్లీష్ ఓపెనర్ ఐపీఎల్‌కు బదులుగా కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నాటింగ్‌హామ్‌షైర్ తరపున ఆడనున్నాడు. కాగా బీసీసీఐ గతేడాది తీసుకొచ్చిన రూల్స్ ప్రకారం.. వేలంలో అమ్ముడుపోయిన ఏ విదేశీ ఆటగాడైనా, సరైన వైద్య కారణాలు లేకుండా టోర్నీ ప్రారంభానికి ముందు తప్పుకుంటే వారిపై రెండేళ్ల పాటు నిషేధం విధిస్తారు. దీంతో డకెట్ రెండేళ్ల ఐపీఎల్ బ్యాన్‌ను ఎదుర్కోనున్నాడు.తాజాగా ఇదే విషయంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తీవ్రంగా స్పందించారు. చివరి నిమిషంలో వైదొలగే విదేశీ ఆటగాళ్లపై రెండేళ్ల నిషేధం పెద్దగా ప్రభావం చూపడం లేదని గవాస్కర్ అన్నారు."బెన్ డకెట్ ఐపీఎల్ నుంచి తప్పుకోవడం నిజంగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు గట్టి ఎదురు దెబ్బే. ఎందుకంటే అతడు ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. యాషెస్ సిరీస్‌లో కూడా మెరుగైన ప్రదర్శన చేశాడు. అయితే ది హండ్రెడ్ లీగ్ వేలంలో అతడికి మంచి ధర దక్కడంతో ఐపీఎల్ కాంట్రాక్ట్‌ను వదులుకోవడానికి సిద్ధమయ్యాడు. ఒకవేళ అతడికి నామమాత్రపు ధర దక్కి ఉంటే పరిస్థితులు భిన్నంగా ఉండేవి. వేలంలో ఒక ఆటగాడిని నమ్మి కోట్లు ఖర్చు పెట్టిన తర్వాత, సదరు ఆటగాడు ఆకస్మికంగా తప్పుకుంటే జట్టు ప్రణాళికలపై కచ్చితంగా ప్రభావం చూపుతోంది. అందుకే ఆటగాళ్లకు భయం కలిగేలా మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం బీసీసీఐ విధిస్తున్న రెండేళ్ల బ్యాన్ సరిపోదు. అది పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఈ విషయంపై బీసీసీఐ మరోసారి ఆలోచించాలి" అని గవాస్కర్ ఇండియా టూడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.



# ముంబైతో మ్యాచ్.. భయంలో కేకేఆర్!

ఐపీఎల్(IPl) 2026 సీజన్‌లో భాగంగా ఇవాళ(ఆదివారం)ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్(KKR) మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రతిష్టాత్మక వాంఖడే స్టేడియం ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇటీవల భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 సెమీఫైనల్ తర్వాత ఈ వేదిక ఆతిథ్యం ఇవ్వనున్న తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. అయితే ఈ మ్యాచ్‌లో ముంబై ఫేవరెట్‌గా కనిపిస్తోంది. కేకేఆర్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. ఈ రెండు జట్లలో కేకేఆర్‌పై ఒత్తిడి కాస్త ఎక్కువే ఉండొచ్చు. ఎందుకంటే ముంబైని వారి సొంత గ్రౌండ్‌లో కేకేఆర్ ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే ఓడించగలిగింది. వాంఖడేలో ఇరు జట్ల మధ్య 12 మ్యాచ్‌లు జరిగితే 10 సార్లు ముంబై విజయం సాధించింది. అయితే ఈసారి దానిని తిరగరాసి విజయంతో సీజన్‌ను ప్రారంభించాలని కేకేఆర్ ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు దాదాపు ప్రతీ ఐపీఎల్ సీజన్‌ను ముంబై ఓటమితోనే ప్రారంభించిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఇది కేకేఆర్‌కు సానుకూల అంశమే. ముంబై మాత్రం ఈ సారి తొలి మ్యాచ్ విజయం సాధించి.. ఓటమి ప్రారంభాన్ని బ్రేక్ చేయాలనే కసితో ఉంది. 2008 ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి చూసుకుంటే ఇప్పటి వరకు 35 సార్లు తలపడగా ముంబై 24 సార్లు నెగ్గితే, కేకేఆర్ 11 సార్లు విజయం సాధించింది. బలబలాల విషయానికొస్తే.. కేకేఆర్‌తో పోలిస్తే ముంబై బ్యాటింగ్ లైనప్ కాస్త బలంగా ఉంది. వరుసగా మూడో సీజన్‌లో హార్దిక్ పాండ్యా ముంబై జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియాలోని నలుగురు (పాండ్యా, సూర్యకుమార్, తిలక్ వర్మ, బుమ్రా) ముంబై జట్టులో ఉండడం బలమని చెప్పొచ్చు. బౌలింగ్‌లో బుమ్రా మరోసారి కీలకం కానుండగా, కివీస్ మాజీ బౌలర్ బౌల్ట్ కూడా ప్రమాదకారే. ఇక కేకేఆర్ బ్యాటింగ్ విషయానికొస్తే రహానే, సునీల్ నరైన్, సీఫెర్ట్, రఘువంశీ, రింకూ సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్లు రమణ్‌దీప్, కామెరున్ గ్రీన్‌లు కీలకం కానున్నారు. బౌలింగ్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, వైభవ్ అరోరా, ముజరబానీ కీలక పాత్ర పోషించున్నారు. ఓపెనింగ్ బ్యాటర్ అజింక్య రహానే నేతృత్వంలోనే ఈ జట్టు కొనసాగుతుంది. దశాబ్దానికి పైగా ఆండ్రీ రస్సెల్ లేకుండా కేకేఆర్ ఆడుతున్న మొదటి సీజన్ ఇది కావడం గమనార్హం.

# గంభీర్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు

- **36 గంటలు డెడ్‌లైన్ విధించిన ధర్మాసనం**

ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తన గుర్తింపును దుర్వినియోగం చేస్తున్నారని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. తాజాగా గంభీర్ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు.. గంభీర్‌కు అనుకూలంగా తీర్పును ఇచ్చింది. గంభీర్ పేరు, చిత్రం, వాయిస్, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను నిరోధించేలా మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. 36 గంటల్లో ఆ వీడియోలను తొలగించాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. గంభీర్ తరపు న్యాయవాదులు పలు సోషల్ మీడియా అకౌంట్స్, ఆన్‌లైన్ సెల్లర్స్ గంభీర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, అనధికార ఉత్పత్తులను విక్రయిస్తున్నారని వాదించారు. ఆ వాదనలతో కోర్టు ఏకభవించింది. ఈ సందర్భంగా జస్టిస్ జ్యోతి సింగ్ మాట్లాడుతూ..అత్యంత ప్రతిభావంతులైన



భారత క్రికెటర్లలో గంభీర్ ఒక్కరని, అతను అనుమతి లేకుండా ఆదాయం ఆర్జించేలా అతని కంటెంట్‌ను, వస్తువులను మార్కెట్‌లోకి తీసుకరావడం అతని వ్యక్తిగత, ప్రచార హక్కులను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. 36 గంటల్లో ఆ కంటెంట్‌ను తొలగించడంతోపాటు బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, టెక్ ప్లాట్‌ఫామ్స్ మెటా, గూగుల్‌లను ఆదేశించింది.

# విరాట్ కోహ్లీని ఆపడం కష్టమే

ఇలా ఆడితే, విరాట్ కోహ్లీని ఆపడం కష్టమే అంటూ సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వెల్లడించారు. బెంగళూరు చేతిలో సన్ రైజర్స్ తొలి మ్యాచ్ ఓడింది. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ 69 పరుగులతో ఇరగదీశాడు. ఈ దెబ్బకు 6 వికెట్ల తేడాతో హైదరాబాద్ చిత్తుగా ఓడింది. ఇక ఈ మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ బ్యాటింగ్, హైదరాబాద్ ఓటమిపై కెప్టెన్ ఇషాన్ కిషన్ స్పందించాడు. తొలి మ్యాచ్ లో బెంగళూరు బ్యాటింగ్ అద్భుతంగా ఉందని ప్రశంసించాడు. ముఖ్యంగా ఛేజింగ్ చేసేటప్పుడు విరాట్ కోహ్లీ అస్సలు పట్టు వదలబోడని.. ఇలాంటి ఇన్నింగ్స్ అతను ఎన్నో ఆడాడని గుర్తు చేశారు. అయితే విరాట్ కోహ్లీని త్వరగా ఔట్ చేయాలని చాలా ప్రయత్నం చేశాం.. కానీ అతను మాత్రం అస్సలు చిక్కలేదని వెల్లడించారు ఇషాన్ కిషన్. లేకపోతే, మేమే గెలిచే వాళ్ళం అన్నారు. అయితే ఈ టోర్నమెంటులో విరాట్ కోహ్లీ ఫామ్ ఇలాగే కొనసాగితే అతన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు.బెంగళూరు మ్యాచ్ లో తమ బ్యాటింగ్ అద్భుతంగా ఉన్నప్పటికీ..బౌలింగ్ లో విఫలమైనట్లు తెలిపారు. తర్వాతి మ్యాచ్ లో వీటన్నిటిని చక్కదిద్దుకొని, కం బ్యాక్ ఇస్తామని ప్రకటించాడు కొత్త కెప్టెన్ ఇషాన్ కిషన్. కాగా ఈ మ్యాచ్ లో మొదటి బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 201 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని కేవలం 15.4 ఓవర్లలో ఫినిష్ చేసింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. దీంతో ఆరు వికెట్ల తేడాతో విక్టరీ అందుకుంది బెంగళూరు.





# సౌదీ యువరాజు నన్ను ప్రసన్నంరేసుకుంటున్నారు


- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**అఖండ సూర్య, వైట్ హౌస్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ (MBS) తనను ప్రసన్నం చేసుకుంటున్నారని (kissing my ass) వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలో జరిగిన ఓ పెట్టుబడిదారుల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన అధ్యక్షతన అమెరికా ఇంత బలంగా ఎదుగుతుందని సౌదీ యువరాజు ఊహించలేదని ట్రంప్ అన్నారు. "ఏడాది క్రితం మీది చచ్చిన దేశం, ఇప్పుడు ప్రపంచంలోనే హాటెస్ట్ కంట్రీ అని ఆయన (సల్మాన్) నాతో అన్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. "నేను మరో ఓడిపోయిన అమెరికా అధ్యక్షుడిలా ఉంటానని ఆయన అనుకున్నారు. కానీ ఇప్పుడు నాకు మర్యాద ఇవ్వాల్సి వస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. అయితే, వెంటనే స్వరం మార్చిన ట్రంప్.. సౌదీ యువరాజును "అద్భుతమైన వ్యక్తి", "యోధుడు" అని కొనియాడారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు సౌదీ అరేబియాతో పాటు ఇతర గల్ఫ్ దేశాలు మద్దతుగా నిలిచాయని ప్రశంసించారు. సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ మనతో కలిసి పోరాడాయని గుర్తు చేశారు.అమెరికాఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమై నెల రోజులు పూర్తయిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌తో భవిష్యత్తులో కుదుర్చుకునే ఏ ఒప్పందమైనా ఆ దేశ క్షిపణి, డ్రోన్ సామర్థ్యాలను శాశ్వతంగా నిరోధించాలని గల్ఫ్ దేశాలు అమెరికాపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇంధన సరఫరాలను ఇరాన్ మళ్లీ ఆయుధంగా వాడకుండా చూడాలని కోరుతున్నాయి.కాగా, ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధం డజనుకు పైగా దేశాల్లో ప్రభావం చూపుతోంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,900 మందితో సహా మొత్తం 4,500 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని 'ది ఇండిపెండెంట్' నివేదించింది.

# హర్మూజ్ జలసంధి గుండా పాకిస్థాన్ నౌకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్





**అఖండ సూర్య, ఇరాన్ :**

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, పాకిస్థాన్‌కు చెందిన 20 నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ స్వయంగా ప్రకటించారు. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం "శాంతికి సంకేతం" అని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రకారం, ప్రతిరోజూ రెండు పాకిస్థాన్ జెండా నౌకలు ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా వెళ్లేందుకు అనుమతి లభించింది. "పాకిస్థాన్ జెండాతో ఉన్న మరో 20 నౌకలు హర్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఇది ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే నిర్మాణాత్మక చర్య" అని ఇషాక్ దార్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రాంతంలో స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల ఇస్లామాబాద్, టెహ్రాన్ మధ్య జరిగిన దౌత్యపరమైన చర్చల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఇషాక్ దార్ తన ఇరాన్ కౌంటర్‌పార్ట్ అబ్బాస్ అరాగ్చితో ఫోన్‌లో మాట్లాడారు. శాశ్వత శాంతి కోసం చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. అయితే, హర్మూజ్ జలసంధిని తాము పూర్తిగా మూసివేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్, ఇరాక్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలకు సురక్షిత ప్రయాణానికి అనుమతి ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చి తెలిపారు. కానీ, అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్య వివాదంలో పాలుపంచుకుంటున్న కొన్ని గల్ఫ్ దేశాల నౌకలకు మాత్రం ఈ మార్గంలో అనుమతి లేదని ఆయన తేల్చిచెప్పారు.

# అమెరికా ఫైటర్ జెట్ డ్రోన్‌ను కూల్చేశాం: ఇరాన్



**అఖండ సూర్య, ఇరాన్ :**

పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అమెరికాకు చెందిన ఒక F16 ఫైటింగ్ ఫాల్కన్ యుద్ధ విమానంతో పాటు, ఒక MQ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్ కార్ప్స్ (IRGC) సంచలన ప్రకటన చేసింది. తమ దేశ దక్షిణ గగనతలంలో ఈ ఘటనలు జరిగాయని తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన పరిశ్రమలపై ప్రతీకార దాడులు చేస్తున్న క్రమంలోనే ఈ చర్యలు చేపట్టినట్లు ఐఆర్‌జీసీ తన అధికారిక వార్తా సంస్థ 'సెపా న్యూస్' ద్వారా వెల్లడించింది. తమ F16 విమానం లక్ష్యంగా దాడి జరిగిందని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) కూడా అంగీకరించిందని ఇరాన్ పేర్కొంది. అయితే, "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఒక F16 విమానం సురక్షితంగా మిడిల్ ఈస్ట్‌లోని బేస్‌లో ల్యాండ్ అయింది" అని సెంటకామ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇదే సమయంలో, దుబాయ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన యాంటీడ్రోన్ పరికరాల గిడ్డంగిని కూడా ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జీసీ శనివారం ప్రకటించింది. అమెరికా దళాలకు సహకరిస్తున్న ఈ గిడ్డంగిపై దాడి చేసి, అందులో ఉన్న 21 మంది ఉక్రెయిన్ పౌరులతో సహా మొత్తం కేంద్రాన్ని నాశనం చేశామని తెలిపింది. అయితే, ఇరాన్ ఆరోపణలను ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. ఇదొక "అబద్ధం", "నిరాధారమైన ప్రచారం" అని ఉక్రెయిన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. ఈ సమాచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చిచెప్పారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తుండగా, వాటికి ప్రతీకారంగా ఇరాన్, దాని మిత్రపక్షాలు దాడులకు దిగుతున్న నేపథ్యంలో ఈ తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# ఇరాన్‌కు భారీ షాక్



- ఖర్గ్ ద్వీపం అమెరికా వశం
- ఇరాన్ ఆర్థిక వెన్నెముకపై అమెరికా భారీ దెబ్బ
- భూతల దాడులకు సిద్ధమవుతున్న ట్రంప్ యంత్రాంగం
- హర్మూజ్ జలసంధిలో తీవ్రతరమవుతున్న ఘర్షణలు
- ప్రపంచవ్యాప్తంగా పెట్రో ధరలు పెరిగే ప్రమాదం

**అఖండ సూర్య, ఇరాన్ :**

ఔపశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా సంచలన చర్యకు దిగింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్'ను అమెరికా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే జరుగుతాయి. ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బతీసినట్లయింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అమెరికా వైమానిక, నౌకాదళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా, త్వరలో ఇరాన్ భూభాగంలోకి సైన్యాన్ని పంపేందుకు (గ్రౌండ్ ఆపరేషన్స్) ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే పశ్చిమాసియాకు అదనపు బలగాలను తరలిస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. అమెరికా నేరుగా ఇరాన్ గడ్డపైకి సైన్యాన్ని పంపాలని నిర్ణయించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలపై ఇరాన్ అనుకూల వర్గాలు చేసిన దాడులకు ప్రతిగా అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. మరోవైపు, హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించడంతో, ఆ మార్గాన్ని తమ నియంత్రణలో ఉంచుకునేందుకు అమెరికా దళాలు భీకరంగా పోరాడుతున్నాయి.ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధి ద్వారా చమురు సరఫరా నిలిచిపోతే, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# షరతులతో అమెరికాతో చర్చలకు సిద్ధం :ఇరాన్


**అఖండ సూర్య, ఇరాన్ :**



అమెరికా, ఇరాన్ మధ్య గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. అయితే, చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలంటే అమెరికా తమ ఐదు షరతులను తప్పనిసరిగా అంగీకరించాలని స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతుల్లో ప్రధానంగా.. తమ భూభాగంపై, ముఖ్యంగా ఇంధన వనరులపై అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని విధించిన వాణిజ్య, చమురు ఆంక్షలన్నింటినీ పూర్తిగా ఎత్తివేయాలని కోరింది. అలాగే, పశ్చిమాసియా ప్రాంతం నుంచి, ముఖ్యంగా తమ సరిహద్దుల నుంచి అమెరికా సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, యుద్ధం వల్ల దెబ్బతిన్న తమ చమురు బావులు, ఇతర మౌలిక సదుపాయాలకు అమెరికా నష్టపరిహారం చెల్లించాలని, తమ దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకూడదని ఇరాన్ తేల్చిచెప్పింది. ఖతార్, ఒమన్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇరాన్ విధించిన ఈ షరతులపై వైట్ హౌస్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. గతంలో 'షరతులు లేని చర్చల'కు మాత్రమే సిద్ధమని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిణామాలపై ఆసక్తి నెలకొంది. కాల్పుల విరమణ వంటి కొన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినా, నష్టపరిహారం వంటి డిమాండ్‌కు అమెరికా అంగీకరించడం కష్టమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# 3,500 మంది మేరైన్లను దించిన అమెరికా

**అఖండ సూర్య, వైట్ హౌస్ :**



ఇరాన్‌తో యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా కీలక చర్యలు చేపట్టింది. పశ్చిమాసియాలో తన సైనిక శక్తిని గణనీయంగా పెంచుతూ 3,500 మంది మెరైన్లు, నావికులతో కూడిన ఓ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను మోహరించింది. ఈ బలగాలు మార్చి 27న మధ్యప్రాచ్యానికి చేరుకున్నాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) శనివారం ఒక ప్రకటనలో ధ్రువీకరించింది.యూఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధనౌకపై ఈ బలగాలు సెంటకామ్ బాధ్యతలు నిర్వర్తించే ప్రాంతానికి వచ్చాయని తెలిపింది. ఈ బృందంలో దాదాపు 3,500 మంది సైనికులతో పాటు, రవాణా, ఫైటర్ విమానాలు, దాడులకు అవసరమైన ఇతర యుద్ధ సామాగ్రి కూడా ఉన్నాయి. సముద్రం నుంచి, నేలపై నుంచి ఏకకాలంలో దాడులు చేయగల సామర్థ్యం ఈ బలగాలకు ఉంది. వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తీరప్రాంత లక్ష్యాలపై దాడులు చేయడం వంటి వేగవంతమైన ఆపరేషన్ల కోసం ఈ తరహా యూనిట్లను ఉపయోగిస్తారు.ఇదిలా ఉండగా, మధ్యప్రాచ్యానికి మరో 10,000 మంది సైనికులను పంపే ప్రతిపాదనను పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. దౌత్య మార్గాలతో పాటు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరిన్ని సైనిక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉంచడమే దీని లక్ష్యమని తెలుస్తోంది. ఈ బలగాలను ఇరాన్‌కు సమీపంలో, ముఖ్యంగా ఆ దేశానికి కీలకమైన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ద్వీపంపై దాడికి వీలుగా ఉండే ప్రాంతాల్లో మోహరించే అవకాశం ఉందని రక్షణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# ట్రంప్‌కు వ్యతిరేకంగా 'నో కింగ్స్' నిరసనలు

- దద్దరిల్లిన అమెరికా, యూరప్

**అఖండ సూర్య, వైట్ హౌస్ :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు, ఇరాన్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా శనివారం అమెరికా, ఐరోపా వ్యాప్తంగా భారీ నిరసనలు వెల్లువెత్తాయి. "నో కింగ్స్" (రాజులు వద్దు) అనే నినాదంతో జరిగిన ఈ ర్యాలీలతో పలు నగరాలు దద్దరిల్లాయి. మిన్నెసోటా ఈ నిరసనలకు ప్రధాన కేంద్రంగా నిలిచింది. సెయింట్ పాల్‌లోని మిన్నెసోటా క్యాపిటల్ లాన్ వద్ద వేలాది మంది ప్రజలు గుమిగూడి తమ నిరసనను శాంతియుతంగా తెలియజేశారు. కొందరు ఆందోళనకారులు అమెరికా జెండాలను తలకిందులుగా పట్టుకుని దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని సూచించారు. మిన్నెసోటాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ పాల్గొన్నారు. ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా ఆయన తన "స్ట్రీట్స్ ఆఫ్ మిన్నియాపాలిస్" పాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పోరాటం దేశానికి ఆశను అందిస్తోందని, ఈ "ప్రతిగామి పీడకల"ను కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు.




ఈ కార్యక్రమంలో గాయని జోన్ బేజ్, నటి జేన్ ఫోండా, సెనేటర్ బెర్నీ సాండర్స్ వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నారు.దేశంలోని 50 రాష్ట్రాల్లో 3,100కు పైగా కార్యక్రమాలు జరగ్గా సుమారు 90 లక్షల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు అంచనా వేశారు. న్యూయార్క్ వంటి డెమోక్రాటిక్ నగరాల నుంచి ట్రంప్‌కు అధిక మద్దతు ఉన్న ఇడాహోలోని చిన్న పట్టణాల వరకు ఈ ర్యాలీలు జరగడం విశేషం. వాషింగ్టన్‌లో వందలాది మంది లింకన్ మెమోరియల్ నుంచి నేషనల్ మాల్ వరకు కవాతు నిర్వహించారు. అయితే, ఈ నిరసనలను వైట్‌హౌస్ కొట్టిపారేసింది. ఇవి కేవలం "లెఫ్టిస్ట్ ఫండింగ్ నెట్‌వర్క్" సృష్టించినవని, వీటికి ప్రజా మద్దతు లేదని అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ విమర్శించారు. నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెస్ కమిటీ (NRCC) కూడా వీటిని "అమెరికా ద్వేషపూరిత ర్యాలీలు"గా అభివర్ణించింది. అమెరికా వెలుపల లండన్, పారిస్, రోమ్ వంటి నగరాల్లోనూ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. రోమ్‌లో వేలాది మంది యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




# దుబాయ్‌లో అమెరికా స్థావరాలపై దాడులు

- భారీ ప్రాణనష్టం ఇరాన్ సంచలన ప్రకటన

**అఖండ సూర్య, ఇరాన్ :**

దుబాయ్‌లోని రెండు రహస్య అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి, డ్రోన్లతో దాడులు చేసి భారీ నష్టాన్ని కలిగించామని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఈ దాడుల్లో అమెరికాకు తీవ్ర ప్రాణనష్టం వాటిల్లిందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. దుబాయ్‌లో ఉన్న రెండు రహస్య అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించామని, ఒక స్థావరంలో 400 మంది, మరో స్థావరంలో 100 మంది సైనికులు ఉన్నారని, మొత్తం 500 మంది ఉన్న ఈ స్థావరాలపై కచ్చితత్వంతో క్షిపణులను ప్రయోగించామని ఐఆర్‌జీసీ పేర్కొంది. ఈ దాడుల్లో గాయపడిన అమెరికన్లను తరలించేందుకు దుబాయ్‌లోని అంబులెన్సులు గంటల తరబడి పనిచేశాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఈ ప్రాంతంలో అమెరికా సైనికులకు తీవ్ర ప్రాణనష్టం తప్పదనే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్, అక్కడి సైనిక కమాండర్లు అర్థం చేసుకుంటారని ఓ ఐఆర్‌జీసీ కమాండర్ హెచ్చరించారు. వారు లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. మరోవైపు, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ గల్ఫ్ దేశాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు మద్దతు ఇవ్వవద్దని ఆయన సూచించారు. గల్ఫ్ దేశాల్లో శాంతి, అభివృద్ధి నెలకొనాలంటే తాము చెప్పినట్లు నడుచుకోవాలని హెచ్చరించారు.



# వార్తల్లోకెక్కిన ట్రంప్ కుమారుడు

**అఖండ సూర్య, వైట్ హౌస్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు బ్యారన్ ట్రంప్‌ను కోర్టు ప్రశంసించడంతో వార్తల్లోకి ఎక్కాడు. బ్యారన్‌తో స్నేహం చేస్తున్నందుకు తన ప్రియురాలిపై దాడి చేసిన ఓ వ్యక్తికి యూకే కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. మాత్వే రూమియాంత్సేవ్ (23) అనే రష్యా జాతీయుడిని ఈ కేసులో దోషిగా నిర్ధారించింది. బ్యారన్ ట్రంప్ సమయస్ఫూర్తితో వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్లే బాధితురాలి ప్రాణాలు నిలిచాయని న్యాయమూర్తి ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. వివరాల్లోకి వెళితే.. గతేడాది జనవరి 18న లండన్‌లోని తన ఫ్లాట్‌లో రూమియాంత్సేవ్ తన ప్రియురాలిపై దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో అమెరికాలో ఉన్న బ్యారన్ ట్రంప్, ఆ యువతితో ఫేస్‌టైమ్ వీడియో కాల్‌లో మాట్లాడుతున్నారు. బ్యారన్‌తో స్నేహంపై అసూయతో రగిలిపోయిన రూమియాంత్సేవ్, ఆమెను జుట్టు పట్టి లాగి, తీవ్రంగా కొట్టాడు. ఈ దాడిని ప్రత్యక్షంగా చూసిన బ్యారన్, వెంటనే యూకే ఎమర్జెన్సీ సర్వీసెస్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు.ఈ కేసు విచారణ స్నార్స్‌బ్రూక్ క్రౌన్ కోర్టులో జరిగింది. న్యాయమూర్తి జోయెల్ బెన్నతన్, బ్యారన్ ట్రంప్ చూపిన చొరవను ప్రశంసించారు. 'అమెరికాలో ఉన్నప్పటికీ బ్యారన్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎమర్జెన్సీ సర్వీసులకు ఫోన్ చేశారు. అతను చూసింది చెప్పారు' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నిందితుడు రూమియాంత్సేవ్‌లో ఏమాత్రం పశ్చాత్తాపం లేదని, అసూయతోనే ఈ దారుణానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. దాడికి పాల్పడినందుకు రెండేళ్లు, జైలు నుంచి బాధితురాలికి లేఖ రాసి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినందుకు మరో రెండేళ్లు కలిపి మొత్తం నాలుగేళ్ల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది.



# మోనాలిసాపై పరువు నష్టం దావా


- **దర్శకుడు సనోజ్ మిశ్రా**

కుంభమేళా సమయంలో ఒక్క ఫొటోతో రాత్రికి రాత్రే సెన్సేషన్ అయిన మోనాలిసా స్టోరీ రోజుకో మలుపు తిరుగుతోంది. సంచార తెగకు చెందిన ఒక పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె... ఏకంగా సినీ రంగంలోకే అడుగుపెట్టేసింది. అయితే, ఫర్మాన్ ఖాన్‌ను మోనాలిసా భోంస్లే ప్రేమించి, పోలీసుల సమక్షంలో వివాహం చేసుకోవడంతో కథ కీలక మలుపు తీసుకుంది. ఆమెకు హీరోయిన్‌గా అవకాశం ఇచ్చిన దర్శకుడు సనోజ్ మిశ్రా ఈ పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వివాహం చట్టబద్ధంగా చెల్లదని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇద్దరి మధ్య చిచ్చు పెట్టాయి. సరోజ్ మిశ్రా వ్యాఖ్యలపై కేరళలో జరిగిన విలేకరుల సమావేశంలో మోనాలిసా ఘాటుగా స్పందించారు. సినిమా షూటింగ్ సమయంలో ఆయన తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, లైంగికంగా వేధించాడని సంచలన ఆరోపణలు చేశారు. తన తొలి సినిమా అవకాశం కావడంతో కుటుంబ సభ్యుల సూచన మేరకు అప్పట్లో మౌనంగా ఉన్నానని, కానీ ఇప్పుడు నిజం బయటపెడుతున్నానని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, మోనాలిసా ఆరోపణలను సనోజ్ మిశ్రా పూర్తిగా కొట్టిపారేశారు. ఆమె కుటుంబ సభ్యులు ఇప్పటికీ తన ఇంట్లోనే ఉంటున్నారని, కేవలం పెళ్లిని వ్యతిరేకించినందుకే తనపై కక్ష గట్టి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. నటన నేర్పించేటప్పుడు లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించినందుకు మోనాలిసాపై త్వరలోనే పరువు నష్టం దావా వేయనున్నట్లు, నిజానిజాలు తేల్చేందుకు కోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# దిల్ రాజు భారీ స్కెచ్!

బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ , టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా చిత్రం ఖరారైంది. దర్శకుడు వంశీ పైడిపల్లి తెరకెక్కించనున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించబోతున్నారు . ఏప్రిల్ 2026 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమా కోసం సల్మాన్ ఖాన్ తొలిసారిగా లాభాల్లో వాటా పద్ధతిలో పని చేయడం విశేషం . భారతీయ సినీ పరిశ్రమలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్స్‌పైకి వెళ్ళేందుకు సిద్ధమైంది. బాలీవుడ్ సుల్తాన్ సల్మాన్ ఖాన్ , టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు , స్టైలిష్ మేకింగ్‌కు పేరుగాంచిన దర్శకుడు వంశీ పైడిపల్లి కలయికలో ఒక భారీ పాన్‌ఇండియా యాక్షన్ ఎంటర్టైనర్ ఖరారైంది. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్‌తోనే అటు ఉత్తరాది, ఇటు దక్షిణాది సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా సల్మాన్ ఖాన్‌కు ఆశించిన స్థాయిలో హిట్లు అందడం లేదు. ముఖ్యంగా 'సికిందర్' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ప్రభావం చూపకపోవడంతో సల్మాన్ ఇప్పుడు తన రూటు మార్చారు. ప్రస్తుతం టాలీవుడ్ దర్శకులు, నిర్మాతలు పాన్‌ఇండియా స్థాయిలో సృష్టిస్తున్న ప్రభంజనాన్ని చూసి, ఆయన దిల్ రాజు నిర్మాణంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమా కోసం సల్మాన్ ఖాన్ మొదటిసారిగా ప్రాఫిట్ షేరింగ్ (లాభాల్లో వాటా) పద్ధతిలో పని చేస్తుండటం గమనార్హం. ఈ సినిమాకు సంబంధించి తాజాగా అందుతున్న లీకుల ప్రకారం, ఇందులో సల్మాన్ సరసన కథానాయికగా 'లేడీ సూపర్ స్టార్' నయనతార నటించబోతున్నారు. ఇప్పటికే 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో సత్తా చాటిన నయన్, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో తొలిసారి జతకట్టడం ఈ ప్రాజెక్ట్‌కు అతిపెద్ద ప్లస్ పాయింట్. వీరిద్దరి కెమిస్ట్రీ వెండితెరపై కొత్త మ్యాజిక్ సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. అంతేకాకుండా, సీనియర్ స్టార్ అనిల్ కపూర్ ఇందులో ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. వంశీ పైడిపల్లికి ఇది బాలీవుడ్ డెబ్యూ మూవీ కానుంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ ప్రస్తుతం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' చిత్రంలో నటిస్తున్నారు. దీనికి ముందుగా 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' అని పేరు పెట్టగా తర్వాత మార్చారు. అపూర్వ లఖియా దర్శకత్వంలో రూపొందుతున్న దేశభక్తి యాక్షన్ డ్రామా తెరకెక్కుతోన్న ఈ మూవీతో చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ పనులు ముగిసిన వెంటనే ఏప్రిల్ నుంచి వంశీ పైడిపల్లి సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీన్ని వచ్చే ఏడాది ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. షూటింగ్‌ను 2026 చివరి నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహించాలని దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారు.







# ఇంకో బ్లాక్ బస్టర్ రెడీ

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ చిత్రాన్ని రూపొందిస్తోన్నారు. వెంకటేష్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తోన్న అయిదో సినిమా ఇది. అలాగే కల్యాణ్ రామ్ తో రీయూనిట్ కావడం ఇది రెండోసారి. ఆయా మూవీలన్నీ కూడా ఇండస్ట్రీ హిట్ కొట్టినవే కావడం వల్ల ఈ లేటెస్ట్ ఫిల్మ్ పైనా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దీని విడుదల తేదీ కూడా వెల్లడైంది అప్పుడే. ఈ భారీ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ నిర్మిస్తోంది. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ మూవీకి ఇంకా టైటిల్ ఖరారు కాలేదు. 2027 సంక్రాంతి ఎంటర్‌టైనర్‌గా విడుదల కాబోతోంది. దీనికి VenkyAnil5, NkrAR2 అనే వర్కింగ్ టైటిల్స్ ఖరారయ్యాయి. భగవంత్ కేసరి, మన శంకర వరప్రసాద్ గారు వంటి వరుస విజయాలందించిన షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో సాహు గారపాటి ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను సురేష్ ప్రొడక్షన్స్, అర్చన సంయుక్తంగా సమర్పించనున్నాయి. జీ స్టూడియోస్ సహనిర్మాతగా చేరింది. ఈ సినిమా అనిల్ రావిపూడికి వెంకటేష్‌తో అయిదో ప్రాజెక్ట్. గతంలో ఎఫ్ 2, ఎఫ్ 3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు వంటి విజయవంత చిత్రాల తర్వాత వీరిద్దరి కలయికలో రానుంది. అలాగే నందమూరి కళ్యాణ్ రామ్ తొలి బ్లాక్ బస్టర్ పటాస్ కు దర్శకత్వం వహించింది అనిల్ రావిపూడే. ఈ విజయం తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్ రామ్ నటిస్తోండటం ఇది రెండోసారి. అలాగే షైన్ స్క్రీన్స్ బ్యానర్‌తో అనిల్ రావిపూడికి ఇది మూడో చిత్రం. అనిల్ రావిపూడి తన మార్కు క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా, ఆకట్టుకునే కథనంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు, పండగ వాతావరణం పర్ఫెక్ట్‌గా మేళవించిన ఈ చిత్రాన్ని సంపూర్ణ సంక్రాంతి కానుకగా రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి అంచనాలకు తగ్గట్టుగా స్క్రిప్ట్‌ను తీర్చిదిద్దుతున్నారు. త్వరలో పూజతో చిత్రాన్ని ప్రారంభించి, అధికారిక టైటిల్, ఇతర వివరాలను వెల్లడిస్తారు.

# రామ్‌చరణ్ నా ప్రాణం కంటే ఎక్కువ



మెగాస్టార్ చిరంజీవి వారసుడిగా అడుగుపెట్టినా, తనకంటూ ఒక ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ ప్రస్థానం ఇప్పుడు జాతీయ స్థాయికి చేరింది. ముఖ్యంగా 'పుష్ప' చిత్రంతో ఉత్తరాదిని ఊపేసిన బన్నీ, అక్కడ ఒక స్టార్ హీరోగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇటువంటి తరుణంలో ఆయన మనసులో ఉన్న అభిమాన హీరో ఎవరు అనే విషయం గురించి తెలుసుకుందాం. విషయాలు ఇప్పుడు మళ్ళీ చర్చకు వస్తున్నాయి. ఒక పాత వీడియోలో అల్లు అర్జున్ ఈ విషయాన్ని చెప్పారు.బన్నీ చేసిన వ్యాఖ్యలు వైరల్అల్లు అర్జున్ వ్యక్తిత్వంలో, డ్యాన్స్‌లో, నటనలో మెగాస్టార్ చిరంజీవి ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. చిన్నప్పటి నుంచి చిరంజీవి సినిమాలను చూస్తూ, ఆయన మేనరిజమ్స్‌ను ఒంటబట్టించుకున్న బన్నీకి మెగాస్టారే సర్వస్వం. చైల్డ్ ఆర్టిస్ట్‌గా చిరంజీవి సినిమాల్లో కనిపించిన దగ్గరి నుండి నేడు గ్లోబల్ స్టార్‌గా ఎదిగే వరకు, తన ప్రతి విజయాన్ని మెగాస్టార్‌కే అంకితం ఇస్తూ వచ్చారు బన్నీ. సాధారణంగా పవన్ కళ్యాణ్ అంటే అల్లు అర్జున్‌కు ఉన్న గౌరవం అందరికీ తెలిసిందే. కానీ, మెగాస్టార్ తర్వాత బన్నీ అంతలా ప్రేమించే, ఆరాధించే మరో హీరో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. గతంలో ఒక వేదికపై బన్నీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్ళీ వైరల్ అవుతున్నాయి. 'రామ్ చరణ్ నా ప్రాణం.. నా ప్రాణం కంటే ఎక్కువ.. నేను ఒక హీరోగా కాకుండా, ఒక అభిమానిగా చెబుతున్నా.. చరణ్ నంబర్ వన్ స్థానంలో ఉండాలని కోరుకునే మొదటి వ్యక్తిని నేనే' అని బన్నీ ఎంతో ఆవేశంగా, ఆప్యాయంగా చెప్పుకొచ్చారు. ఎంతో సరదాగా ముచ్చటించుకున్నారు పవన్ కళ్యాణ్ గురించి ప్రస్తావిస్తూ.. 'ఆయన చూడని రేంజ్ లేదు, ఆయన స్థాయి అందరికీ తెలుసు. ఇప్పుడు ఆ స్థాయికి చరణ్ వెళ్తున్నాడు, వెళ్లాలి కూడా. రాబోయే 25 ఏళ్లు చరణ్ ఒక ధృవతారలా వెలగాలని కోరుకుంటున్నాను' అని అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు వారిద్దరి మధ్య ఉన్న విడదీయరాని బంధానికి నిదర్శనం. కొన్నాళ్లుగా మెగాఅల్లు కుటుంబాల మధ్య గ్యాప్ వచ్చిందని, ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు దూరాన్ని పెంచాయని పుకార్లు షికార్లు చేశాయి. అయితే, ఇటీవల జరిగిన అల్లు శిరీష్ వివాహ వేడుకల్లో చరణ్, బన్నీ ఇద్దరూ ఎంతో క్లోజ్‌గా మెలిగి, సరదాగా ముచ్చటించుకుంటూ కనిపించారు. ఈ దృశ్యాలు చూశాక మెగా అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కుటుంబాల మధ్య ఎన్ని చర్చలు జరిగినా, ఈ ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉన్న ప్రేమానురాగాలు మాత్రం ఎప్పటికీ తగ్గవని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి.

# గోల్డెన్ చాన్స్ కొట్టేసిన డింపుల్

నందమూరి బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో యంగ్ బ్యూటీ డింపుల్ హయాతికి గోల్డెన్ ఛాన్స్ దక్కింది. ముంబై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రంలో ఇప్పటికే నయనతార మెయిన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రెండో కథానాయికగా డింపుల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఈమె పాత్ర కథను మలుపు తిప్పుతుందని టాక్. బాలయ్య సరసన అవకాశం దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంటారు నట సింహం నందమూరి బాలకృష్ణ . ఒకవైపు రాజకీయాల్లో ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేస్తూనే, మరోవైపు సినిమాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలయ్య ఒక భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌లో నటిస్తున్నారు. పట్టాలెక్కించారు. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే, ఈ క్రేజీ ప్రాజెక్టులో యంగ్ బ్యూటీ డింపుల్ హయాతి కీలక పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఇప్పటికే హీరోయిన్‌గా 'లేడీ సూపర్ స్టార్' నయనతార నటిస్తుండగా, రెండో హీరోయిన్ పాత్ర కోసం డింపుల్ హయాతిని మేకర్స్ ఎంపిక చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సినిమా సెకండ్ హాఫ్ లో వచ్చే కీలకమైన మలుపుల్లో డింపుల్ పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని టాక్. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో డింపుల్ గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించబోతున్నారట. దీనిపై త్వరలోనే చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడనుంది. బాలయ్య సినిమాలో ఛాన్స్ అంటే డింపుల్ హయతి బంపరాఫర్ కొట్టేసినట్లేనని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కథా నేపథ్యం గురించి వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఇది ముంబై గ్యాంగ్‌స్టర్ బ్యాక్ డ్రాప్‌లో సాగనుంది. బాలయ్య ఇందులో ఒక పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో రౌద్రం చూపించబోతున్నారని తెలుస్తోంది. గోపీచంద్ మలినేని తన మార్క్ మాస్ ఎలివేషన్లతో ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నారు. ముంబై వీధుల్లో బాలయ్య చేసే యాక్షన్ హంగామా థియేటర్లలో పూనకాలు తెప్పిస్తుందని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఇక డింపుల్ కెరీర్ విషయానికొస్తే... 2017లో 'గల్ఫ్' అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన ఆమెకు వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్'లోని "జర్ర జర్ర" ఐటమ్ సాంగ్ ఊహించని క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆ తర్వాత రవితేజ సరసన 'ఖిలాడి', గోపీచంద్ తో 'రామబాణం' చిత్రాల్లో నటించి మెప్పించింది. రీసెంట్‌గా రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే సినిమాతో అలరించింది. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో 1960ల నాటి ఉత్తర తెలంగాణమహారాష్ట్ర సరిహద్దు యధార్థ గాథ ఆధారంగా తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'భోగి'లో డింపుల్ ఒక కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్ మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. గ్లామరస్ పాత్రలతో పాటు కమర్షియల్ సినిమాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్న డింపుల్ ఇప్పుడు బాలయ్య వంటి సీనియర్ స్టార్ సరసన అవకాశం దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో పెద్ద మైలురాయిగా నిలవనుంది.



This newspaper is published by Petta Venkata Suryanarayana from 388, ChandraT heatre, Main Road, Gosala, Krishna District,A ndhra Pradesh - 521151. It is published on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana, and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises, 388, Chandra Theatre, Main Road, Gosala, Krishna District, Andhra Pradesh - 521151. Email: seshasai09@gmail.com,. Phone: 9618880945